

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక


సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి ఆదివారం 05-04-2026 సంపుటి: 01 సంచిక : 289 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Sunday 05-04-2026 Volume :01 Issue: 289 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani



**రిపోర్టర్లు కావలెను**


జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number 9059328777


# పాక్‌కు షాకిచ్చిన యూఏఈ..



- వెంటనే అప్పు తీర్చాలని అల్టిమేటం..
- 3. 5 బిలియన్ డాలర్ల అప్పు కట్టాల్సిన పరిస్థితి
- 30 ఏళ్ల అప్పు తీర్చబోతున్న పాక్

న్యూఢిల్లీ,
పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో పాకిస్తాన్‌కు యూఏఈ షాకిచ్చింది. తమ దగ్గర తీసుకున్న అప్పును పూర్తిగా, అది కూడా వెంటనే చెల్లించాలని కోరింది. దీంతో ఈ నెలలోనే యూఏఈ అప్పు తీర్చేందుకు పాక్ సిద్ధమైంది. మొత్తం 3.5 బిలియన్ డాలర్ల అప్పును యూఏఈకి పాకిస్తాన్ ఈ నెలలోనే చెల్లించబోతుంది. ఒకవైపు అంతర్జాతీయ రిజర్వ్ తక్కువగా ఉన్నా, మరోవైపు ఐఎంఎఫ్ నుంచి ఒత్తిడి ఉన్నా.. పాక్ తప్పనిసరి పరిస్థితుల్లో అప్పు -మిగతా 2 లో

# సైన్యం కోసం కంపెనీల బాటకు రష్యా!


- ఉక్రెయిన్‌తో యుద్ధంలో 3.2 లక్షల మంది జవాన్ల నష్టం
- సైన్యానికి ఉద్యోగులను ఇవ్వాలని సంస్థలకు రష్యా ఆదేశం!



న్యూఢిల్లీ,
ఉక్రెయిన్‌తో నాలుగేండ్లుగా సాగుతున్న యుద్ధంలో 3.5 లక్షల మంది సైనికులను కోల్పోవడం రష్యాకు భారీ నష్టాన్ని మిగిల్చింది. దీంతో సైన్యం కోసం రహస్య నియామకాలకు రష్యన్ కంపెనీలు కేంద్రంగా మారాయి. కాంట్రాక్ట్ సైనిక సేవ కోసం అభ్యర్థుల జాబితాలను రూపొందించే ప్రక్రియలో 150 కంటే ఎక్కువ మంది -మిగతా 2 లో

# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

- సీట్లు కోల్పోతామన్న వాదనలో అర్థం లేదు
- కేరళ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ



తిరువనంతపురం,
జనాభా నియంత్రణతో దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ స్థానాలు కోల్పోతాయంటూ చేస్తున్న వాదనల్లో నిజం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కొందరు కావాలనే ఈ వాదనను తెరపైకి తెచ్చారని అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎల్డీఎఫ్ ఉద్వాసనకు కౌంట్‌డౌన్ మొదలైందని చెప్పారు. తిరువళ్లలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ, కేరళ అభివృద్ధిపై కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఎన్నడూ దృష్టి పెట్టలేదని, 2004-2014 మధ్య కేరళ అభివృద్ధికి అప్పటి కేంద్రంలోని -మిగతా 2 లో

# బాసర అభివృద్ధికి రూ.225 కోట్లు

## బాసర మాస్టర్ ప్లాన్‌కు సీఎం రేవంత్ ఓకే

- రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి
- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణాలు
- ఆయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి
- ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలి
- ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన
- అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించిన రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నేటి దర్శిని)
బాసర ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న బాసర సరస్వతి ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం కాగా, ఆలయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

-మిగతా 2 లో







# సమీర్ రిజ్వీ విధ్వంసం..

- ముంబైని చిత్తుగా ఓడించిన ఢిల్లీ..!
- 6 వికెట్ల తేడాతో ముంబైపై గెలుపు
- వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం

న్యూఢిల్లీ ఏప్రిల్ 4 (నేటి దర్శిని)
ఢిల్లీ జట్టును సమీర్ రిజ్వీ మరోసారి ఆదుకున్నాడు. మొదటి మ్యాచ్‌లో లక్నోతో జరిగిన మ్యాచ్‌లో 70 పరుగులు చేసి అజయంగా నిలిచి జట్టును గెలిపించిన రిజ్వీ.. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 90 (7 ఫోర్లు, 7 సిక్సులు) పరుగులు చేసి జట్టుకు రెండో విజయాన్ని అందించాడు. మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఢిల్లీకి 163 పరుగుల టార్గెట్‌ను సెట్ చేసింది. 18.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి టార్గెట్‌ను ఫినిష్ చేసింది ఢిల్లీ. ఛేజింగ్‌లో ఢిల్లీకి మొదట్లోనే పెద్ద షాక్ తగిలింది. ఓపెనర్ కేఎల్ రాహుల్ (1), నితీష్ రానా (0) తక్కువ పరుగులకే ఔట్ అయ్యారు. దీంతో రిజ్వీ, -మిగతా 2 లో



# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

- బావిలోకి దూసుకెళ్లిన కారు
- ఒకే కుటుంబానికి చెందిన 9మంది మృతి

ముంబై,
మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని మృతుల బంధువులు తెలిపారు. నాసిక్ జిల్లా డిండోరీ తాలూకాలో ఈ ప్రమాదం జరిగింది. శివాజీ నగర్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తుండగా వారిని మృత్యువు కబలించింది. వివరాల్లోకి వెళ్తే.. నాసిక్ జిల్లాలోని డిండోరీ ప్రాంతానికి చెందిన సునీల్ దత్తాత్రేయ దర్గుడే (34).. తన భార్య రేష్మా దర్గుడే (30), కుమార్తె రాఖీ అలియాస్ గుణవతి దర్గుడే, వదిన ఆశా దర్గుడే (32), ఆమె కుమారుడు శ్రేయాస్ దర్గుడే, కుమార్తె శ్రిష్టి దర్గుడేతో కలిసి కారులో శివాజీనగర్‌లో శుక్రవారం -మిగతా 2 లో



# అమెరికాకు చావు దెబ్బ!

- అయినా ఆడంబర ప్రకటనలు ఆపని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- పశ్చిమాసియా యుద్ధంలో అగ్ర రాజ్యానికి భారీ ఆర్థిక నష్టం
- ఒకే రోజు రెండు విమానాలు, రెండు హెలికాప్టర్ల కూల్చివేత
- గత 20 ఏండ్ల కాలంలో ఆ దేశానికి ఇదే భారీ ఎదురు దెబ్బ

2 లో

# పెట్రోల్ పై రూ.80 తగ్గింపు ... ఎక్కడంటే...




2 లో

# సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు

- బాస్‌ల పేరుతో హానికరమైన మెయిల్స్
- అప్రమత్తంగా ఉండాలని సిపి సజ్జనార్ హెచ్చరిక



హైదరాబాద్, ఏప్రిల్ 4 (నేటి దర్శిని)
వ్యాపార సంస్థల అధినేతలు, సీఈఓలు, సీఎఫ్ఓలే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు సరికొత్త వాట్సాప్ మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ హెచ్చరించారు. సంస్థల అధికారిక ఈమెయిల్స్‌కు హానికరమైన ఫిషింగ్ లింకులు పంపడం ద్వారా కంప్యూటర్లలోకి మాల్వేర్‌ను ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల సిస్టమ్స్‌పై నేరగాళ్లు పూర్తిస్థాయి రిమోట్ యాక్సెస్‌ను పొందుతూ -మిగతా 2 లో



# రేపటి నుంచి హెల్త్ వీక్

- వారం పాటు విస్తృతంగా కార్యక్రమాలు
- 6న నెక్లెస్ రోడ్డులో ఈట్ రైట్ వాక్.. నేచురోపతిలో మిల్లెట్ మేళా
- ఈ 7న 871 మంది డాక్టర్లకు నియామక పత్రాలు
- అదేరోజు క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రారంభించనున్న మంత్రి
- ఎల్ఐఎన్ఏసీ సేవలు నిమ్స్‌లో అందుబాటులోకి:
- ఉన్నతాధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ దిశానిర్దేశం

హైదరాబాద్ ఏప్రిల్ 4 (నేటి దర్శిని)
ప్రజాపాలనలో భాగంగా ఆరో తేదీ నుంచి 11 వరకు హెల్త్ వీక్ నిర్వహించనున్నారు. ఆరోతేదీన సేఫ్టీఫోకస్ డేగా గుర్తించి ఆరోజు ఉదయం 6.30 గంటలకు హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో ఈట్ రైట్ వాక్ చేపట్టనున్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి నేచురోపతి ఆస్పత్రిలో 40 స్టాళ్లతో మిల్లెట్ మేళా ఏర్పాటు చేయనున్నారు. ఆ కార్యక్రమంలో ఫుడ్ హ్యాండ్లర్లకు శిక్షణ, స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులకు సర్టిఫికెట్ల పంపిణీ, హైజీన్ రేటింగ్ సర్టిఫికెట్ల పంపిణీ చేపట్టనున్నారు. జిల్లాల్లో కూడా ఉదయం ఈట్ రైట్ వాక్‌లు, మధ్యాహ్నం ఫుడ్ రిజిస్ట్రేషన్ మేళాలు నిర్వహించనున్నారు. ఏడో తేదీన ప్రపంచ ఆరోగ్య దినోత్సవం -మిగతా 2 లో

# కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ షురూ

## ప్రభుత్వ అరాచకాలపై ప్రజాస్వామ్య జయకేతనం

- క్యాతనపల్లి విజయంలో మిత్రపక్షమైన సీపీఐ కనబరిచిన పోరాట పటిమ ఎంతో స్ఫూర్తిదాయకం
- కేవలం రెండున్నరేండ్ల పాలనలోనే పీకల్లోతు ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్
- క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం మున్సిపాల్టీల్లో విజయంపై కేటీఆర్ హర్షం



హైదరాబాద్ ఏప్రిల్ 4 (నేటి దర్శిని)
కాంగ్రెస్ అరాచకాలను ఓడించి ప్రజాస్వామ్య జయకేతనం ఎగురవేశామని బీఆర్ఎస్ వర్కింగ్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) తెలిపారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాల్టీ చైర్మెన్ పీఠాలను గెలవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న -మిగతా 2 లో

# పాక్‌కు షాకిచ్చిన యూఏఈ..

మొదటి తరువాయి

తీర్చేయబోతుంది.ప్రస్తుతం ఇరాన్ యుద్ధం కారణంగా యూఏఈ కూడా ఆర్థిక సమస్యల్ని ఎదుర్కొంటుంది. దీంతో తమ బాకీ చెల్లించాలని పాక్‌ను కోరింది. దీనికి పాకిస్తాన్ కూడా అంగీకరించింది. ఈ నెల 11న 450 మిలియన్ డాలర్లు, 17న 2 బిలియన్ డాలర్లు, 23న బిలియన్ డాలర్లను పాక్ చెల్లించేందుకు అంగీకరించింది. సెంట్రల్ బ్యాంకుకు చెందిన 16.4 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వల నుంచి ఈ నిధులను పాక్ చెల్లించబోతుంది. ఈ అప్పుల్లో మూడు దశాబ్దాల నాటి అప్పు కూడా ఉండటం విశేషం. 1996-97లో పాకిస్తాన్ 450 మిలియన్ డాలర్లను అప్పుగా తీసుకుంది. అప్పట్లో ఒక సంవత్సర కాల పరిమితితో ఈ అప్పు తీసుకుంది. అయితే, ఇంతవరకు చెల్లించలేదు. ఈసారి మాత్రం చెల్లించబోతుంది. నిజానికి పాకిస్తాన్‌కు ఇచ్చిన అప్పు కాల పరిమితిని పొడిగించాలని ఇటీవల యూఏఈ నిర్ణయించింది. దీనిపై ఇంకా సంప్రదింపులు జరుగుతున్నాయి. కానీ, ఈలోగానే ఇరాన్ యుద్ధం ప్రారంభమవ్వడంతో యూఏఈ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. డబ్బులు చెల్లించాలని పాక్‌ను కోరింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పాకిస్తాన్‌కు యూఏఈ సహా అమెరికా, చైనా, సౌదీ అరేబియా వంటి దేశాలు సహాయం అందిస్తున్నాయి. ఐఎంఎఫ్ నుంచి పాకిస్తాన్‌కు నిధులు అందేలా చూస్తున్నాయి. ఆయ దేశాలు కూడా అప్పులు ఇస్తున్నాయి.

# సైన్యం కోసం కంపెనీల బాటకు రష్యా!

మొదటి తరువాయి

ఉద్యోగులు ఉన్న సంస్థలను రష్యా అన్వేషించడం ప్రారంభించింది. ర్యాజాన్ ప్రాంతంలో ప్రైవేట్, ప్రభుత్వ యాజమాన్యంలోని కంపెనీలు ఉద్యోగులను నామినేట్ చేయాలని ఆదేశిస్తూ అక్కడి గవర్నర్ పావెల్ మల్కోవ్ ఒక ఉత్తర్వుపై సంతకం చేశారు. ఈ ఉత్తర్వు ప్రకారం అవసరమైన అభ్యర్థుల సంఖ్య కంపెనీ పరిమాణంపై ఆధారపడి ఉంటుంది. 150 నుండి 300 మంది ఉద్యోగులు ఉన్న కంపెనీలు కనీసం ఇద్దరు అభ్యర్థులను, 300 నుండి 500 మంది ఉన్న కంపెనీలు ముగ్గురు అభ్యర్థులను, 500 కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న కంపెనీలు ఐదుగురు అభ్యర్థులను నామినేట్ చేయాలని ఆయన ఆదేశించారు. వాస్తవానికి ఇది యజమానులపై ఒక కొత్త రకమైన ఒత్తిడిని సృష్టించనున్నది. దీనికి కారణం వారు కూడా ఇప్పుడు నియామక వ్యవస్థలో భాగం కావడం. ఇది అధికారిక ప్రకటన లేకుండా రహస్యంగా సమీకరణ జరిపేందుకు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తుంది. రష్యా అధికారికంగా మరో విడత సైన్య సమీకరణను ప్రకటించనప్పటికీ అధికారులు సైన్యాన్ని తిరిగి నింపడానికి ప్రత్యామ్నాయ పద్ధతులను ఉపయోగిస్తున్నారు. వీటిలో ఆర్థిక ప్రోత్సాహకాలు, ఖైదీలను నియమించుకోవడం, విదేశీ నియామకాలు, ఇప్పుడు వ్యాపార సంస్థల ద్వారా ఒత్తిడి తేవడం వంటివి ఉన్నాయి. ఈ కొత్త విధానంతో స్వచ్ఛంద సేవకు క్రమంగా మంగళం పాడుతున్నట్లు అర్థమవుతున్నది. ఈ ఉత్తర్వులో తమ ఆదేశాలను పాటించని కంపెనీలపై విధించే శిక్షలను స్పష్టంగా పేర్కొనలేదు. కాని ప్రభుత్వ ఆదేశాలను అడ్డుకునే కంపెనీలకు ప్రస్తుత చట్టం ప్రకారం 10 లక్షల రూబుల్స్(12,300 డాలర్లు) వరకు జరిమానాలు విధించవచ్చు. ర్యాజాన్ ప్రాంత గవర్నర్ పావెల్ మల్కోవ్ సంతకం చేసిన ఈ ఆదేశం ప్రకారం యాజమాన్య స్వరూపంతో సంబంధం లేకుండా సంస్థలు సెప్టెంబర్ 20 లోగా నియామకాల కోటాలను నిర్ధారించాలని నిర్దేశిస్తున్నది.

# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

మొదటి తరువాయి

యూపీఏ ప్రభుత్వం కేటాయించిన మొత్తం కంటే తమ ప్రభుత్వం ఎక్కువ కేటాయించిందని చెప్పారు. 'ఇంతకుముందు కూడా ఇక్కడకు వచ్చాను. కానీ ఈసారి అన్నివైపుల నుంచి మార్పు కోరుతున్న బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కేరళలో అతిపెద్ద మార్పు రాబోతోంది. తొలిసారి బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం కేరళలో అధికారంలోకి రాబోతోంది' అని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎల్డీఎఫ్-యూడీఎఫ్ ప్రభుత్వాలు ఎప్పుడూ ఈ ప్రాంతం గురించి పట్టించుకోలేదని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, చాలా ఏళ్లుగా ఒక్క ప్రధాన బ్రిడ్జి కూడా నిర్మించ లేదని, మెడికల్ కాలేజీ పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో ఉంటాయనేది ఎవరైనా ఊహించవచ్చని అన్నారు. ఎన్డీయే విధానాలతో ప్రతి ఒక్క వర్గానికి, ముఖ్యంగా మహిళలు ఎంతో లబ్ది పొందుతున్నారని ప్రధాని అన్నారు. వలస కార్మికులకు ఉద్యోగాలు కల్పన కేరళలో అతిపెద్ద సమస్యగా ఉందని, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ఇది మోదీ ఇచ్చే హామీ అని ప్రధాని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాలు, గోవా తరహాలోనే కేరళను అభివృద్ధి చేస్తామని అన్నారు. శబరి రైల్వే ప్రాజెక్టు నిలిచిపోవడానికి ఎల్డీఎఫ్ కారణమని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులూ తొలగిపోతాయని భరోసా ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈశాన్య రాష్ట్రాల్లో మాదిరిగా అభివృద్ధి ప్రాజెక్టులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ ఆయన.. పశ్చిమాసియా అంశంపై భయాన్ని సృష్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కేరళలో శబరిమల రైల్వే ప్రాజెక్టు కొత్త అవకాశాలను తీసుకురాగలదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇది శబరిమలకు ప్రత్యక్ష అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని.. స్థానిక వ్యాపారాలకు కొత్త ఊపునిస్తుందని చెప్పారు.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

మొదటి తరువాయి

రాత్రి జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. వేసవి సెలవులు కావడంతో.. ఫంక్షన్ అనంతరం రేష్మా దర్గడే మేరకోడళ్లు మాధురి, శ్రావణి.. అశా దర్గడే మేన కోడలు సమృద్ధి కూడా వారితో ఇండోర్ గ్రామానికి బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో డిండోరీ తాలూకా కేంద్రంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ బావిలోకి దూసుకెళ్లింది. అది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో కారును బయటికి తీశారు. ఆ కారులో 8 మృతదేహాలు ఉన్నాయి. కారు నుంచి బయటపడిన మరో బాలిక మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెతికి వెలికి తీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ప్రమాద సమయంలో సునీల్ దత్తాత్రేయ దర్గడే కారు నడుపుతున్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. కాగా ఈ ప్రమాదంలో మరణించిన ఆరుగురు పిల్లలు 7 నుంచి 14 ఏళ్ల మధ్య వయసు వారేని తెలిపారు. ఆ ఆరుగురిలో ఒకరు బాలుడు, ఐదుగురు బాలికలు ఉన్నట్లు చెప్పారు.ద

# రేపటి నుంచి హెల్త్ వీక్

మొదటి తరువాయి

ఉన్న సంగతి తెలిసిందే. క్యాన్సర్ రోగులకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకుగానూ నిమ్స్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఎల్ఐఎన్ఏసీ యంత్రాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ ప్రారంభించనున్నారు. అనంతరం రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. ఆ కార్యక్రమంలో తెలంగాణ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రారంభం, ట్రామా కేర్ పాలసీ, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ పోర్టల్, పీసీఅండ్ పీఎన్‌డీజీ, ఏఆర్‌టీ సరోగసీ పోర్టల్స్‌ను ప్రారంభించనున్నారు. ఉత్తమ వైద్య సేవలు అందించిన వారికి అవార్డుల ప్రదానం వంటి కార్యక్రమాలు ఉంటాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులకు ఎంపికైన 871 మంది డాక్టర్లకు మంత్రి నియామక పత్రాలు అందజేయనున్నారు. అనంతరం, ఎర్రగడ్డలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భవనాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభిస్తారు. 8న సేఫ్ మదర్ డే పేరుతో హైదరాబాద్‌లోని బోయిగూడలోని మిడ్‌వైఫరీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాల్లో ఏఎన్‌సీ పరీక్షలు, హైరిస్క్ కేసుల గుర్తింపు, ప్రసూతి సేవలపై వర్క్‌షాప్‌ల నిర్వాహణ, గ్రామస్థాయిలో మహిళలకు అవగాహన కల్పించనున్నారు. ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు 9న హైదరాబాద్‌లో రెడ్ రన్, జిల్లాల్లో అవగాహన ర్యాలీలు చేపడతారు.

# సమీర్ రిజ్వీ విధ్వంసం..

మొదటి తరువాయి




నిస్సంకా 44 (6 ఫోర్లు, 1 సిక్స్) స్కోర్ బోర్డును పరుగులు పెట్టించే బాధ్యతను తమపై వేసుకున్నారు. వీరిద్దరు కలిసి 67 పరుగుల పార్ట్‌నర్‌షిప్ నెలకొల్పారు. నిస్సంకా ఔట్ అయిన తర్వాత.. రిజ్వీ మరింత దూకుడుగా ఆడాడు. దీంతో ఓడిపోతుందా అనే సందేహం నుంచి ఈజీగా చేజింగ్ చేసే దిశకు రిజ్వీ మ్యాచ్‌ను మలుపుతిప్పేశాడు. ముంబై బౌలర్లలో సాంట్నర్, కార్బన్ బాష్, దీపక్ చాహర్ చెరో వికెట్ పడగొట్టారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబై.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 162 పరుగులు సాధించింది. సూర్యకుమార్ యాదవ్ 51 (3 ఫోర్లు, 2 సిక్సులు), రోహిత్ శర్మ 35 (5 ఫోర్లు, 1 సిక్సు) మినహా మిగతా బ్యాటర్లంతా చేతులెత్తేశారు. యువ పేసర్ ముఖేష్ కుమార్ ఆరంభంలోనే ర్యాన్ రిక్కల్‌టన్ (9), తిలక్ వర్మ (0) వికెట్లను పడగొట్టాడు. ఆ తర్వాత రోహిత్ శర్మతో కలిసి కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ జట్టు స్కోర్ బోర్డును పరుగులు పెట్టించే ప్రయత్నం చేశారు. కానీ అక్షర్ పటేల్ వీరిద్దరి పార్ట్‌నర్‌షిప్‌కు బ్రేక్ వేశాడు. రోహిత్‌ను 10వ ఓవర్‌లో పెవిలియన్‌కు పంపాడు. ఈ

పిచ్ పై పటిష్టమైన ముంబై ఇండియన్స్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి కేవలం 162 పరుగులు మాత్రమే చేసింది. ఢిల్లీ బౌలర్లు మొదట్నుంచీ కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్ తో బౌలింగ్ చేశారు. క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ముంబై ఇండియన్స్ బ్యాటర్లు భారీ స్కోరు చేయకుండా అడ్డుకోవడంలో సక్సెస్ అయ్యారు. ముంబై ఇండియన్స్ తరఫున కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ హాఫ్ సెంచరీ సాధించాడు.

సూర్య 36 బంతుల్లో 51 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్ లో 3 ఫోర్లు, రెండు సిక్సర్లు వచ్చాయి. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 26 బంతుల్లో 35 పరుగులు చేశాడు. ఢిల్లీ జట్టు ఐదుగురు బౌలర్లు వికెట్లు తీశారు. 18 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన దశలో మరో ఓపెనర్ రోహిత్ శర్మకు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ జత కలిశాడు. వీరిద్దరూ ఆచితూచి ఆడూతు చెత్త బంతులను బౌండరీలకు తరలించారు. వీరిద్దరి మధ్య 53 పరుగుల భాగస్వామ్యం నెలకొంది. రోహిత్ శర్మ 26 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 35 పరుగులు చేశాక అక్షర్ పటేల్ బౌలింగ్ లో ఔటయ్యాడు. మరోవైపు సూర్యకుమార్ 36 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 51 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడాడు. లుంగి ఎంగిడి బౌలింగ్ లో వికెట్ల ముందు దొరికిపోయాడు.

# బాసర అభివృద్ధికి రూ.225 కోట్లు

మొదటి తరువాయి

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈవీ వాహనాలనే అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రణలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

# అమెరికాకు చావు దెబ్బ!..

**-అయినా ఆడంబర ప్రకటనలు ఆపని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**
**-పశ్చిమాసియా యుద్ధంలో అగ్ర రాజ్యానికి భారీ ఆర్థిక నష్టం**
**-ఒకే రోజు రెండు విమానాలు, రెండు హెలికాప్టర్ల కూల్చివేత**
**-గత 20 ఏండ్ల కాలంలో ఆ దేశానికి ఇదే భారీ ఎదురు దెబ్బ**



వాషింగ్టన్:
ఎన్నో యుద్ధాలు చేసిన అనుభవం ఉన్న అగ్ర రాజ్యం అమెరికాకు ఇరాన్‌తో జరిగిన పశ్చిమాసియా యుద్ధంలో మాత్రం చావు దెబ్బ తగిలింది! ప్రాణ నష్టం పెద్దగా లేకపోయినప్పటికీ, ఆ దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అతి పెద్ద ఆర్థిక, ఆయు ధ నష్టం సంభవించింది. ఈ యుద్ధంలో ఆరేడు శక్తిమంతమైన విమానాలు, రాడార్లను కోల్పోయిన అమెరికాడ శుక్రవారం తాజాగా మరో రెండు యుద్ధ విమానాలను కోల్పోయింది. అలాగే ఆ దేశానికి చెందిన రెండు బ్లాక్‌హాక్ హెలికాప్టర్లను ఇరాన్ కూల్చివేసింది. అమెరికా విమాన వాహక నౌకకు కూడా నష్టం కలిగించింది. మొత్తం మీద అమెరికాకు రూ.వేల కోట్ల నష్టం ఏర్పడింది. అసలు ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా చేసిన వ్యూహరచన పూర్తిగా విఫలమైందని యుద్ధ నిపుణులు అంటున్నారు. ఎప్పుడూ ఇరాన్ పాలనను మార్చుదామనే అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది తప్ప, హొర్ముజ్ జల సంధిని ఇరాన్ ఆధీనంలోకి తీసుకొంటుందని, గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు చేస్తుందని యూఎస్ అస్సలు ఊహించలేదని వారు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఇజ్రాయెల్ ఒత్తిడితో యుద్ధంలోకి ఆదరా బాదరాగా అడుగుపెట్టిన అమెరికాకు ఇప్పుడు యుద్ధం నుంచి బయటపడే 'ఎగ్జిట్ ప్లాన్' లేక ఎంగిలిలో పడ్డ ఈగలా గిలగిలా కొట్టుకుంటున్నది. అయినప్పటికీ ఆడంబర ప్రకటనలు చేస్తూ తన బెదిరింపులతో శత్రు దేశానికి లొంగదీసుకోవడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంది. 'ఇరాన్‌ను అమెరికా ఓడించి పూర్తిగా నాశనం చేసింది. పనిని పూర్తి చేయబోతున్నాం. ఈ పనిని మేం అత్యంత వేగంగా ముగించబోతున్నాం' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన రెండు రోజులకే అగ్రరాజ్యానికి భారీ దెబ్బ తగలడం విశేషం.

ఇది యుద్ధం: ట్రంప్

తమ విమానం కూల్చివేత, సెర్చ్ ఆపరేషన్ గురించి చర్చించడానికి వ్యాఖ్యానించడానికి అమెరికా అధ్యక్షుడు తిరస్కరించారు. ఎన్‌బీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ జరిగిన ఘటనలు ఇరాన్‌తో చర్చలకు ఆటంకం కావని అంటూ 'ఇది యుద్ధం' అని వ్యాఖ్యానించారు. మరోవైపు యూఎస్‌కు చెందిన ఏ-10 విమానాన్ని పర్షియన్ గల్ఫ్‌లో తమ రక్షణ దళాలు కూల్చివేశాయని ఇరాన్ ప్రకటించింది. అయితే ఈ విమానం కూలిపోయిందా, లేక కూల్చివేశారా అన్న విషయంపై స్పష్టత లేదని పేరు తెలపడానికి ఇష్టపడని ఒక యూఎస్ అధికారి పేర్కొన్నారు. అలాగే అది ఎక్కడ కూలింది, అందులోని సిబ్బంది పరిస్థితిపై కూడా సమాచారం లేదని అన్నారు. కాగా, ఒక వైపు ఇరాన్ నావిక, వైమానిక దళాలను పూర్తిగా ధ్వంసం చేసామంటూ అగ్రరాజ్యం ప్రకటిస్తుండగా శుక్రవారం ఇరాన్ అటు అమెరికా విమానాలపై ఇటు గల్ఫ్‌లోని చమురు శుద్ధి క్షేత్రంపై దాడులు చేయడమే కాక, ఇజ్రాయెల్‌లోని మొస్సాద్ హెడ్ క్వార్టర్స్‌ను ధ్వం సం చేయడం అందరినీ ఆశ్చర్యపరుస్తున్నది.

# సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు

అక్రమాలకు తెరలేపుతున్నారని చెప్పారు. ఈ మేరకు వివరాలు వెల్లడిస్తూ ఓ ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. సిస్టమ్ నియంత్రణలోకి వచ్చిన తర్వాత అందులో యాక్టివ్‌గా ఉన్న వాట్సాప్ వెబ్ సెషన్లను నేరగాళ్లు చాకచక్యంగా వినియోగిస్తున్నారని సీపీ తెలిపారు. సీఈఓ లేదా సీఎఫ్ఓల పేరుతో అకౌంటెంట్లకు తప్పుదారి పట్టించే సందేశాలను పంపిస్తూ నమ్మిస్తున్నారని వెల్లడించారు. తాము అత్యవసర సమావేశంలో ఉన్నామని, ఫోన్ ఎత్తడం వీలుపడదని చెబుతూ కోట్లాది రూపాయలు కాజేస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ ఇంజనీరింగ్ వ్యూహాలతో తక్షణమే తమ ఖాతాలకు డబ్బును బదిలీ చేయించుకుంటున్నారని చెప్పారు. పై అధికారుల నంబర్ల నుంచే సందేశాలు వస్తుండటంతో అకౌంటెంట్లు కూడా నిజమేనని నమ్మి మోసపోతున్నారని అన్నారు. ఇటీవల హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ప్రతి కంపెనీ కూడా ఇటువంటి సైబర్ దాడుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్‌లో పై అధికారుల పేరుతో వచ్చే ఆర్థిక అభ్యర్థనలను గుడ్డిగా నమ్మకూడదని పేర్కొన్నారు. వెంటనే అధికారులకు నేరుగా ఫోన్ చేసి ఆ సందేశం నిజమేనా కాదా అని ధృవీకరించుకోవాలని చెప్పారు. ఆఫీసు సిస్టమ్స్‌లో నాణ్యమైన్గ ÷ర్‌వాల్స్, యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లను నిరంతరం అప్‌డేట్ చేసి ఉంచాలని అన్నారు. వాట్సాప్ వెబ్ వాడిన ప్రతిసారి తప్పకుండా లాగౌట్ చేయడం మర్చిపోవద్దని తెలిపారు. సాంకేతిక భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారానే ఇటువంటి దాడులను ఎదుర్కోగలమని పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని సజ్జనర్ చెప్పారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్త వహించాలని వివరించారు.

# కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ షురూ

మొదటి తరువాయి

అరాచకాలను ఎదిరించి, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సాధించిన ఘనవిజయాన్ని "ప్రజాస్వామ్య జయకేతనం"గా అభివర్ణించారు. ఆ మున్సిపాల్టీల చైర్మెన్, వైస్ చైర్మెన్లుగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పార్టీ యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ (బంటి)తోపాటు, పార్టీ శ్రేణులకు ప్రత్యేక అభినందనలు ప్రకటించారు. అడ్డదారుల్లో మున్సిపాల్టీలను దక్కించుకోవడానికి కాంగ్రెస్ ఎన్ని ప్రలోభాలు పెట్టినా, ఒత్తిళ్లు తెచ్చినా వేటికీ లొంగకుండా, మొక్కవోని దీక్షతో ఒక్క తాటిపై నిలిచిన కౌన్సిలర్ల ధైర్యానికి ఆయన సెల్యూట్ చేశారు. క్యాతనపల్లి విజయంలో మిత్రపక్షమైన సీపీఐ కనబరిచిన పోరాట పటిమ ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు. రాష్ట్రంలో అణచివేతకు, బెదిరింపులకు, అవినీతి అక్రమాలకు తావులేదని ఈ ఎన్నికల తీర్పు స్పష్టంగా తేల్చి చెప్పిందని విమర్శించారు. కేవలం రెండున్నరేండ్ల పాలనలోనే పీకల్లోతు ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో కౌంట్‌డౌన్ మొదలైందనీ, మున్సిపల్, పంచాయతీ ఎన్నికల ఫలితాలు చాటిచెప్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టించిన గులాబీ జెండా సైనికులను పార్టీ ఎప్పటికీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ విజయాలు అందించిన స్ఫూర్తితో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అడుగడుగునా విధ్వంసం చేస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారుకు రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

# పెట్రోల్ పై రూ.80 తగ్గింపు ... ఎక్కడంటే...

**న్యూఢిల్లీ,**

పశ్చిమాసియా ఘర్షణలు పలు దేశాల్లో ఇంధన సంక్షోభానికి దారితీస్తున్నాయి. దాంతో ఆయా దేశాలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు పెంచుతుండటంతో సామాన్యులపై భారం పడుతోంది. ఇప్పటికే ఆర్థిక సమస్యలతో సతమతమవుతోన్న పాకిస్థాన్.. చమురు ధరలు పెంచి విమర్శల పాలైంది. దాంతో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ ధరను 80 పాకిస్థానీ రూపాయలు తగ్గిస్తూ రాత్రికి రాత్రే షరీఫ్ ప్రకటన చేయాల్సి వచ్చింది.

# దేవరకొండ, కొండమల్లేపల్లి పట్టణాల్లో ఘనంగా రన్ ఫర్ జీసస్

● ఆధ్యాత్మిక ఉత్సాహంతో వేలాదిగా తరలివచ్చిన ప్రజలు







**దేవరకొండ/కొండమల్లేపల్లి ఏప్రిల్ 04 ( నేటి దర్శిని):**
లోకరక్షకుడు యేసుక్రీస్తు పునరుత్థాన పండుగ ఈస్టర్‌ను పురస్కరించుకొని దేవరకొండ మరియు కొండమల్లేపల్లి పట్టణాల్లో 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. మరణాన్ని జయించి తిరిగి లేచిన క్రీస్తు సందేశాన్ని చాటిచెప్పేందుకు క్రైస్తవ సోదరులు, వివిధ చర్చిల పాస్టర్లు మరియు విశ్వాసులు భారీ సంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొన్నారు. దేవరకొండ పట్టణంలో ఉదయం నుంచే ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. దేవరకొండ పట్టణ జడ్చర్ల రోడ్డు నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన రహదారి గుండా సాగుతుంటే, భక్తుల జయధ్వానాలతో రహదారులు మారుమోగాయి. తెల్లని వస్త్రాలు ధరించి, చేతిలో శాంతికి చిహ్నమైన జెండాలను పట్టుకుని యువతీ యువకులు, మహిళలు మరియు చిన్నారులు ఉత్సాహంగా అడుగులు వేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ, త్యాగం మరియు శాంతి మార్గాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని, లోక రక్షణ కోసం తన ప్రాణాలను అర్పించిన దైవకుమారుడి పునరుత్థానం మానవాళికి కొత్త నిరీక్షణను ఇస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా కొండమల్లేపల్లి మండల కేంద్రంలో కూడా రన్ ఫర్ జీసస్ ప్రదర్శన అట్టహాసంగా సాగింది. స్థానిక క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భారీ ర్యాలీలో పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములయ్యారు. భక్తి గీతాల ఆలాపనలు, బ్యాండ్ మేళాల నడుమ సాగిన ఈ ప్రదర్శన పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమైంది. సమాజంలో సోదరభావాన్ని పెంపొందించడానికి, శాంతియుత జీవనాన్ని అలవర్చుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని వక్తలు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో క్రీస్తు మహిమను చాటిచెప్పే ప్రసంగాలు చేస్తూ, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో రన్ ఫర్ జీసస్ నిర్వహణ కమిటీ నియోజక వర్గ కన్వీనర్లు ప్రభు ప్రసాదు, ఐబీ సాల్మన్ రాజ్ , కొండ మల్లేపల్లి మండల అధ్యక్షులు యేకుల సామేలు మరియు పాస్టర్లు దేవ కుమార్, ఎలీషా, శాలెం రాజు, ఎన్. దయాపతి,అబ్రహం, డేనియల్ రాజు, వంశీ రాజు, విక్టర్ , పౌల్, గిరి మరియు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వివిధ ప్రాంతాల నుండి విశ్వాసులు తరలిరావడంతో దేవరకొండ, కొండమల్లేపల్లి పట్టణాలు జనసందడిగా మారాయి. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టగా, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహక కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ రన్ ఫర్ జీసస్ కార్యక్రమం కేవలం ఒక వేడుకలాగే కాకుండా, క్రైస్తవ సమాజం యొక్క ఐక్యతను మరియు దైవభక్తిని చాటిచెప్పే విధంగా విజయవంతంగా ముగిసింది.

## హజ్ యాత్రికులకు అవగాహన కల్పిస్తూ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే నాగరాజు




**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 3 (నేటి దర్శిని బ్యూరో):**
తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ సహకారంతో వరంగల్ హజ్ సొసైటీ కమిటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రకు వెళ్లనున్న యాత్రికులకు హన్మకొండ పబ్లిక్ గార్డెన్స్ నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ ఆయూబ్ ఆహ్వానం మేరకు హాజరైన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు యాత్రికులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ హజ్ యాత్ర ప్రతి ముస్లిం భక్తుడికి అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక ప్రయాణమని అన్నారు. యాత్రికులు అక్కడి నియమ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పరస్పర సహకారం, సహనం క్రమశిక్షణతో యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. విదేశీ దేశంలో ఉండే సమయంలో ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ అధికారులు హజ్ కమిటీ సూచనలను పాటించాలని తెలిపారు. హజ్ యాత్రకు వెళ్లే ప్రతి యాత్రికుడు సుఖ సంతోషాలతో యాత్ర పూర్తి చేసి సురక్షితంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హజ్ సొసైటీ సభ్యులు, మతపెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యాత్రికులు పాల్గొన్నారు.

# రేషన్ షాపుల దగ్గర బియ్యం కోసం గంటల తరబడి క్యూ లైన్....!

● 3 నెలల రేషన్ బియ్యం పొందడానికి ఒకేసారి తంబ్ సిస్టం మార్చాలి
● రేషన్ షాపుల దగ్గర నీడ సౌకర్యం కల్పించాలి



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 3 (నేటి దర్శిని బ్యూరో):**
ఉమ్మడి వరంగల్ జిల్లా రేషన్ షాప్ ల దగ్గర లబ్ధిదారులు గంటలకి తరబడి క్యూ లైన్ లో నిలబడుతున్నామనీ వాపోతున్నారు. ప్రభుత్వము ఏప్రిల్ ,మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం దుకాణాల ద్వారా పంపిణీ ప్రారంభించడంతో షాపుల దగ్గర రద్దీ విపరీతంగా పెరిగిపోయింది .దీంతో బియ్యం తీసుకోవడానికి ఒక రోజు కేటాయించవలసి వస్తుందని ఇబ్బంది పడుతున్నారు. రేషన్ బియ్యం పొందడానికి వేలిముద్ర వేయవలసి ఉంది. మూడు నెలలకు గాను 3 సార్లు ఒక్కొక్క లబ్ధిదారు తంబ్ చేయవలసి వస్తుంది .దీనితో ఒక్కొక్క లబ్ధిదారునికి 10 నిమిషముల నుంచి పావుగంట వరకు సమయం పడుతుంది . అదే సమయంలో సర్వర్ పని చేయకపోవడంతో , మిషన్ పని చేయకపోవడంతో గంటల తరబడి క్యూ లైన్ లో నిలబడవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వము 3 నెలలకు గాను రేషన్ బియ్యం పొందటానికి అప్డేట్ చేసి ఒకేసారి వేలిముద్ర వేయడానికి అవకాశం కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. రేషన్ షాపుల దగ్గర ఎండలో నిలబడాల్సి వస్తుందని, ఎలాంటి నీడ సౌకర్యం కల్పించకపోవడం శోచనీయం అన్నారు. ఎండలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రేషన్ బియ్యం అందజేయడం సంతోషకరమైన విషయమైనప్పటికీ లబ్ధిదారులకు వేలిముద్రలను ఒకేసారి వేసే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో సైతం సన్నబియ్యం ఇవ్వడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.'

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలి: కలెక్టర్

● వరంగల్ నగరంలోని ఎంజీఎంను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 3 (నేటి దర్శిని బ్యూరో):**
వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ నగరంలోని ఎంజీఎం ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర విభాగాలతో పాటు , వార్డులను సందర్శించి రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు సౌకర్యాలపై ఆరా తీశారు. హాస్పిటల్లో పరిశుభ్రత మందుల లభ్యతపై దృష్టి సారించాలని వైద్యులకు సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, వీధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని పేర్కొన్నారు.

# మహిళల సంస్కార వికాసానికి విశ్వమాంగళ్య సభ ఆధ్వర్యంలో 'మహిళా సంస్కార్ సమాగమం'

● ముఖ్యఅతిథిగా ఎంపీ డీకే అరుణ, అపోలో హాస్పిటల్ అధిపతి కే సంగీత రెడ్డి
● కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి





**మిడ్జిల్, ఏప్రిల్ 04, (నేటి దశని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
విశ్వమాంగల్య సభ ఆధ్వర్యంలో మహిళల కోసం నిర్వహించిన "మహిళా సంస్కార్ సమాగమం" కార్యక్రమం చేగూర్ కన్య శాంతి వనంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబుబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ మరియు బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన డీకే అరుణ మహిళల పాత్ర సమాజ నిర్మాణంలో ఎంతో కీలకమని పేర్కొన్నారు. కుటుంబం, సమాజం అభివృద్ధిలో మహిళలు సంస్కారాల మూలస్తంభమని వారు ప్రస్తుత కాలంలో కుటుంబ వ్యవస్థను నిలబెట్టేది తల్లేనని, పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో, పిల్లల విద్యలో తల్లి పాత్ర అపారమని పేర్కొన్నారు. ఆధునికత పేరుతో వస్తున్న మార్పుల మధ్య భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ముఖ్యంగా చిన్నారుల్లో మంచి సంస్కారాలు, నీతి విలువలు పెంపొందించేందుకు తల్లులు ముందుండాలని పిలుపునిచ్చారు.
సమాజంలో పెరుగుతున్న సామాజిక సమస్యలు, కుటుంబ విభేదాలు, యువతలో మారుతున్న జీవనశైలి వంటి అంశాలపై కూడా ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సంస్కార శిబిరాలు ఎంతో అవసరమని, ఇవి సమాజానికి దిశానిర్దేశం చేసే వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు కొనసాగుతున్న ఈ సభలో ఆధ్యాత్మిక ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల అవగాహన సమావేశాలు నిర్వహించబడుతున్నాయి. పాల్గొన్న మహిళలు ఎంతో ఆసక్తిగా కార్యక్రమాలను వీక్షిస్తూ, వివిధ అంశాలపై అవగాహన పొందుతున్నారు. ఈ కార్యక్రమానికి స్టేట్ కౌన్సిల్ సభ్యులు మనోహర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, పాలమూరు జిల్లా ప్రధానకార్యదర్శి కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కోశాధికారి నర్సింహ గౌడ్ నందిగామ కొత్తూరు మండలాల అధ్యక్షులు అరవింద్ చారి, మహేందర్ రెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యులు రమేష్ , నరసింహ, అంజయ్య, నాగరాజు చారి, జొల్లు కుమార్ , అన్నారం రాజు , సత్తయ్య, మల్లేష్ , విక్రాంత్, అరవింద్ స్వీట్, కృష్ణమోహన్, తదితరులు హాజరయ్యారు

## మునిసిపాలిటీ ఎన్నికలలో ఇచ్చిన హామీ

● మృతుడి కుటుంబానికి నగదు చేయూత....
● 12వ వార్డు కౌన్సిలర్ నాగిళ్ల జగన్....



**ఆమనగల్లు, ఏప్రిల్04(నేటి దర్శిని ప్రతినిధి):**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో గంగిశెట్టి కృష్ణయ్య శనివారం మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న 12వ వార్డు కౌన్సిలర్ నాగిళ్ల జగన్ వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి వారిని ఓదార్చి వారికి ధైర్యాన్ని కల్పించారు. అలాగే మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఇచ్చిన హామీని తన సొంత మ్యానిఫెస్టోలో రూపొందించినట్లుగానే 12వ వార్డులో మృతి మృతి చెందిన వారి కుటుంబానికి తన సొంత నిధులు 5000 రూపాయల నగదును వారి కుటుంబానికి అందించారు. చనిపోయిన గంగిశెట్టి కృష్ణయ్య పార్థివ దేహం పై పూలమాలలు వేసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాళ్ల రఘు,గంగిశెట్టి సూర్యప్రకాష్,ఎండి అజీమ్,పల్లె యాదయ్య,నాగిళ్ళ శ్రీకాంత్,నాగిళ్ల శేఖర్,ఎండి అలీమ్,పల్లె శ్రీనివాస్, ఎండి ముక్తార్,తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ట్రా'ఫికర్'



హైదరాబాద్ అంటే ఒకప్పుడు చారిత్రక వైభవం గుర్తొచ్చేది. దాని ఆనవాళ్లయిన పురాతన కట్టడాలు, సంస్కృతి మనసును పులకరింపజేసేవి. కానీ, నేడు 'ట్రాఫిక్ జాం' నగరానికి పర్యాయపదంగా మారిపోయింది. ఉదయం ఆఫీస్‌కు వెళ్లేందుకు బయట అడుగుపెట్టిన నగరవాసికి ప్రతిరోజూ చిన్నపాటి సర్కస్ తప్పదు. గూగుల్ మ్యాప్ చెప్పే నలభై నిమిషాల సమయం వాస్తవ జీవితంలో గంటన్నరకు పైగా సాగినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నుంచి మొదలుకుంటే సామాన్య కూలీ వరకు ప్రతిఒక్కరూ రోజుకు సగటున రెండుమూడు గంటల అమూల్యమైన సమయం రోడ్లపైనే వదిలేస్తున్న పరిస్థితి. అభివృద్ధి అంటే కాంక్రిట్ గోడలు, అద్దాల మేడలు నిర్మించడమే కాదు, పౌరుడి ప్రయాణం సాఫీగా సాగడం కూడా. ప్రస్తుతం ఇంటినుంచి ఆఫీస్ దూరం కంటే, ట్రాఫిక్‌లో గడిపే సమయమే పెద్దసమస్యగా మారింది. రోడ్లపై ప్రయాణించాలంటేనే జంకుతున్న దుస్థితి నెలకొంది. గమ్యం చేరడానికి గంటల తరబడి రోడ్లపై వేచిచూడటం పౌరుల సగటు జీవనప్రమాణాలను కూడా దెబ్బతిస్తోంది. ఏదైనా అత్యవసరమైతే ఎలా వెళ్లాలన్న ఆలోచనే మనిషిని భయాందోళనలో పడేస్తోంది. ఇది కేవలం రోడ్లపై కాదు, ఆరోగ్యంపై, మనసుపై, ఆర్థిక వ్యవస్థపై కూడా తన ముద్ర వేస్తోంది. హైదరాబాద్ అంటే దేశానికి బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకునేలా చేస్తామనే పాలకవర్గాల వాగ్దానాలకు కొదవలేదు. ఒకరేమో ఆకాశహార్మ్యాలు నిర్మించి సింగపూర్‌లా మారుస్తామన్నారు. మరొకరు ఫ్యూచర్‌సిటీ కలలు కంటున్నారు. ఆలోచన మంచిదే, ఆచరణలో పెట్టడమే కష్టం! ఎందుకంటే, ట్రాఫిక్ స్తంభనకు పాలకుల వైఫల్యమే కారణం. రాజధానికి ఉద్యోగ, ఉపాధి కోసం వలసలు పెరిగిన నేపథ్యంలో వాహనాల సంఖ్య కూడా అంతే రెట్టింప వుతోంది. 2010లో సుమారు 35 లక్షల వాహనాలు రోడ్లపై తిరిగేవి. కానీ, నేడు ఆ సంఖ్య కోటి ఐదు లక్షలు దాటడం ఆశ్చర్యకరం. పదిహేనేళ్ల వ్యవధిలోనే వాహనాలు మూడింతలు పెరిగాయి. మరి రహదారులు విస్తరిం చబడ్డాయా? అంటే లేదనే చెప్పాలి. వాహనాలు పెరిగిన వేగంతో పోలిస్తే, రోడ్ల వెడల్పు, కొత్త ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణం ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్నట్టుగానే సాగుతోంది. ప్రజలు ప్రతిరోజూ గంటల తరబడి ట్రాఫిక్‌లో గడపాల్సి వస్తోంది. టైంకు చేరుకోవాలన్న ఆతృతలో కుటుంబంతో, పిల్లలతో గడిపే సమయం కూడా లేకుండా పోతోంది. దేశంలో ఇప్పటివరకు ట్రాఫిక్‌లు రద్దీ ఉన్న నగరాల్లో ఢిల్లీ, ముంబాయి, బెంగళూరు ఉండేవి. వాటి స్థానంలో హైదరాబాద్ కూడా చేరిపోయింది. ఒక నగరం ముందుకెంత సాగుతుందో కాకుండా, ఎంతసేపు 'నిలబడు' తోందో కూడా అభివృద్ధికి ప్రమాణంగా మారుతోంది. ఇది మన ఉత్పాదకశక్తిని కూడా నీరుగారుస్తోందని నిపుణుల అభిప్రాయం. దీనికి అనారోగ్యం అదనం. గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లతో కాలుష్యం పెరిగి గాలి నాణ్యత క్షీణి స్తోంది. పదేళ్ల కిందట 60- 80 మధ్య ఉన్న ఎక్యూఐ ఇప్పుడు సగటున 110-180 వరకు పెరిగింది. శీతాకాలంలో ఇది మూడు వందలు దాటుతోంది. వాహనాలనుంచి ఎగిసే పొగతో శ్వాసకోస సమస్యలు, అలర్జీలు, హృద్రోగాలు పెరుగుతున్నాయి. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు వ్యాధుల బారిన పడుతున్నారు. గతంతో పోలిస్తే నలభై నుంచి అరవైశాతం వ్యాధులు పెరిగినట్టు అంచనా. ఇది నగరంలో మనిషి జీవించే పరిస్థితి లేదని చెప్పే సూచిక. ఇదంతా చూసినప్పుడు మనిషి సగటు ఆయురార్థం జీవితకాలంలో మూడు నాలుగేళ్లు తగ్గుతుందని వైద్యుల భావన. పైగా ట్రాఫిక్‌లో గడిపే సమయం పెరిగేకొద్దీ మానసిక ఒత్తిడి, చిరాకు, అలసట-ఇది దీర్ఘకాలంలో సగటు ఆయుష్షుపై కూడా ప్రభావం చూపుతుంది. ఇకపోతే ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురికావడం, పాదచారులు నడవలేకుండా ఉండటం, మెట్రోపిల్లర్లు, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద అస్తవ్యస్తమైన ట్రాఫిక్ వ్యవస్థ కూడా నగరవాసుల్ని ప్రమాదం, అభద్రతలో పడేసే కారణాలు. ఇందులోనే మరో విషయం. మన పండగలు. సంస్కృతి సంప్రదయాల్ని ఎవరూ కాదనలేరు. మత విశ్వాసాలు వ్యక్తిగతం. కానీ, ఇటీవల శ్రీరామనవమి, హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా చేసిన హంగామా రహదారి వ్యవస్థను మరింత క్లిష్టతరం చేసింది. కిలోమీటర్ల పొడవునా ర్యాలీలు, వినోదాలు, విందులతో రోడ్లపై ట్రాఫిక్ స్తంభిస్తోంది. పోలీసులు దారి మళ్లింపులు చేపట్టినా చుట్టూ కిలోమీటర్ల దూరంతో గమ్యస్థానానికి చేరుకోవాల్సి వస్తోంది. ఉత్సవాల పేరుతో చేసే ఖర్చు, భక్తి పేరుతో పోటీ ప్రదర్శనలు, శబ్ద కాలుష్యం ఆందోళన కలిగిస్తున్నది. పండగల అసలు ఉద్దేశం సామరస్యాన్ని పెంచడమే కానీ, అసౌకర్యాన్ని కలిగించడం కాదు. దీన్ని నగరవాసులు గమనించాలి. ఇప్పటికైనా ప్రజారవాణాను బలపరిచే అంశాలపై సర్కార్ దీర్ఘకాలిక దృష్టి సారించాలి. ఇతర దేశాల్లోలాగా స్మార్ట్ సిగలింగ్ వ్యవస్థను పరిశీలించాలి. సామాన్యులకు అందుబాటులో ఉండేలా మెట్రోను విస్తరించాలి. లేదంటే భవిష్యత్తులో భాగ్యనగరమంటే 'స్తంభించిన నగరం'గా చెప్పుకోవాల్సి వస్తుంది.

## అమిత్ షా పర్యటనలో
# భద్రతా వైఫల్యం, ఘర్షణ..

### నలుగురు పోలీసాఫీసర్లను సస్పెండ్ చేసిన ఈసీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (నేటి దర్శిని)**
పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల వాతావరణం ఉద్రిక్తంగా ఉంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటనలోనే అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ నెల 2న మంత్రి అమిత్ షా బెంగాల్‌లోని భవానిపూర్‌లో పర్యటించారు. అక్కడ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సువేందు అధికారి నామినేషన్ కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్ షో నిర్వహించారు. అయితే, ఈ రోడ్ షోలో ఘర్షణ వాతావరణం తలెత్తింది. బీజేపీ శ్రేణులు పాల్గొన్న ఈ రోడ్ షోలో టీఎంసీకి చెందిన కొందరు దాడికి పాల్పడ్డారు. దీంతో ఇరుపక్షాల మధ్య దాడి జరిగింది. సాధారణంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొనే కార్యక్రమాలకు కఠిన భద్రత ఉంటుంది. ఇలాంటి దాడులకు అవకాశం ఉండదు. కానీ, భవానిపూర్‌లో మాత్రం హింసాత్మక వాతావరణం ఏర్పడింది. దీంతో ఈ అంశంపై ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు చేసింది. దీనిపై నివేదిక ఇవ్వాలని బెంగాల్ ప్రధాన కార్యదర్శిని ఈసీ కోరింది. ఈ నివేదిక ఆధారంగా ఈసీ చర్యలు తీసుకుంది. అమిత్ షా పర్యటనలో అనేక భద్రతా వైఫల్యాలు ఉన్నట్లు గుర్తించింది. దీనికి బాధ్యుల్ని చేస్తూ సిద్ధార్థ్ దత్తా అనే డీసీపీ సహా మరో ముగ్గురిని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. శాంతి భద్రతల్ని కాపాడటంలో వీరు విఫలమయ్యారని ఆరోపించింది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో భవానిపూర్ నియోజకవర్గం చాలా కీలకం. ఎందుకంటే ఇక్కడి నుంచి సీఎం మమతా బెనర్జీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సువేందు అధికారి పోటీ చేస్తున్నారు. వీరిలో ఎవరు గెలిచినా సీఎం కావడం ఖాయం. అయితే, మమతను ఓడించాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది. అందుకే ఈ నియోజకవర్గంలో ఎన్నికల తతంగా ఆసక్తికరంగా మారింది.


## ఆ గ్యాస్ సిలిండర్‌లకు
# అడ్రస్ ప్రూఫ్ అక్కర్లేదు : కేంద్రం




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (నేటి దర్శిని)**
పశ్చిమాసియా లో యుద్ధం కారణంగా పెరుగుతున్న ఉద్రిక్తతలు, ఫలితంగా భయపెడుతున్న ఇంధన కొరత నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇకపై 5 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ను అడ్రస్ ప్రూఫ్ అవసరం లేకుండా కేవలం ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని స్పష్టంచేసింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన చేసింది. సమీపంలోని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల దగ్గర ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని పెట్రోలియం శాఖ తెలిపింది. అదేవిధంగా దేశంలో పెట్రోల్, డీజిల్ లేదా ఎల్పీజీకి ఎలాంటి కొరత లేదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ప్రజలు ఆందోళనచెంది ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రిటైల్ ఔట్‌లెట్లు సాధారణంగా పనిచేస్తున్నాయని, తగినన్ని నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పింది. ముఖ్యంగా వలస కార్మికులు, స్థానిక చిరునామా పత్రాలులేని వారిని దృష్టిలో ఉంచుకుని 5 కేజీల సిలిండర్ నిబంధనను సరళతరం చేసినట్లు అధికారులు వెల్లడించారు. మార్చి 23 నుంచి ఇప్పటివరకు సుమారు 5.7 లక్షల సిలిండర్లను అడ్రస్ ప్రూఫ్ నిబంధన లేకుండా విక్రయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇంధన సరఫరాలో స్థిరత్వాన్ని కొనసాగించడానికి దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని పెంచామని, రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని తెలిపింది. మరోవైపు అక్రమ నిల్వలు, నల్ల బజారును అరికట్టేందుకు నిఘా పెంచామని, ఇటీవల 3,700కు పైగా దాడులు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది

# అమెరికన్ పైలట్‌ను పట్టుకుంటే భారీ నజరానా..

### ఇరాన్ ప్రజలకు స్థానిక ప్రభుత్వం ఆఫర్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (నేటి దర్శిని)**
అమెరికాకు చెందిన ఎఫ్-15 యుద్ధ విమానాన్ని ఇరాన్ తమ గగనతలంలో కూల్చిన సంగతి తెలిసిందే. ఈ విమానంలో ఇద్దరు పైలట్లు ఉంటారు. వారిలో ఒకరిని రెస్క్యూ టీమ్స్ రక్షించాయి. మరో పైలట్ తప్పించుకున్నాడు. అతడి ఆచూకీ మాత్రం తెలియడం లేదు. దీంతో ఆ పైలట్ ఆచూకీ కోసం ఇరాన్ దళాలు గాలిస్తున్నాయి. అంతేకాదు, స్థానిక ప్రజలు కూడా పైలట్ కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్ ఆర్మీ, స్థానిక ప్రభుత్వాలు భిన్నంగా స్పందించాయి. అమెరికన్ పైలట్ కనిపిస్తే బంధించాలని, లేదా చంపాలని స్థానిక గవర్నర్ సూచించారు. పైలట్‌ను పట్టుకున్నా, చంపినా వారికి భారీ నజరానా అందిస్తామని గవర్నర్ ప్రకటించాడు. మరోవైపు ఇరాన్ ఆర్మీ మాత్రం భిన్నంగా స్పందించింది. తమకు పైలట్ పట్టుబడితే అతడిని అంతర్జాతీయ చట్టాల ప్రకారం యుద్ధ ఖైదీగా పరిగణించి తగిన గౌరవం అందిస్తామని ఇరాన్ ఆర్మీ ప్రకటించింది. ఈ సందర్భంగా పాకిస్తాన్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం ఎక్స్‌లో కీలక ప్రకటన చేసింది. అమెరికన్లకు ఇరాన్ దళాలకన్నా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చాలా ప్రమాదకరమని ఇరాన్ వ్యాఖ్యానించింది. "ఇరాన్ కస్టడీలో ఉండటం కన్నా డొనాల్డ్ ట్రంప్‌తో ఉండటమే మీ పిల్లలకు చాలా ప్రమాదకరం. అందుకే, ఆ పైలట్ అమెరికా రెస్క్యూ టీమ్స్‌కు పట్టుబడటంకన్నా, ఇరాన్‌కు దొరకాలని కోరుకోండి. ముస్లింలుగా, నాగరికత తెలిసిన ఇరానియన్లుగా బంధీలను ఎలా గౌరవంగా, మర్యాదగా చూసుకోవాలో మాకు తెలుసు" అని ఇరాన్ ప్రకటించింది. అలాగే, దక్షిణాఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ కూడా దీనిపై ప్రకటన చేసింది. యుద్ధ ఖైదీలను తాము అమెరికా మిత్రదేశాలైన జియోనిస్టులలాగా చూడబోమని చెప్పింది. అమెరికాలాగా, రాతియుగం నాటి పద్ధతులు కాకుండా, నాగరిక విధానాలు తమకున్నాయని ఇరాన్ తెలిపింది. అమెరికాకు చెందిన రెండు యుద్ధ విమానాల్ని ఇరాన్ శుక్రవారం కూల్చిన సంగతి తెలిసిందే. ఈ ఘటనల్లో ఒక పైలట్ తప్పించుకోగా, ఇంకో పైలట్ జాడ తెలియడం లేదు. అతడి కోసం ఇటు ఇరాన్, అటు అమెరికా కూడా వెతుకుతున్నాయి.

# ఈసీ, కాగ్ స్వతంత్రంగా పనిచేయాలి..

### -సుప్రీంకోర్ట్ జస్టిస్ నాగరత్న స్పష్టీకరణ
### -రాజకీయ ప్రభావం వాటిపై ఉండరాదు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (నేటి దర్శిని)**
భారత ఎన్నికల సంఘం(ఈసీఐ), కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) వంటి రాజ్యాంగ సంస్థలు స్వతంత్రంగా పని చేయాలని, వాటి సమగ్రత, ప్రజాస్వామిక పాలనను పరిక్షించేందుకు వాటిని రాజకీయ ప్రాబల్యం నుంచి దూరంగా ఉంచాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న శనివారం స్పష్టం చేశారు. పాట్నాలోని చాణక్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో 'హక్కులకు అతీతమైన రాజ్యాంగవాదం: నిర్మాణం ఎందుకు ముఖ్యం' అనే అంశంపై జరిగిన స్మారకోపన్యాసంలో మాట్లాడుతూ సాధారణ రాజకీయ ప్రకియ తటస్థతను, జవాబుదారీతనాన్ని కల్పించలేని కీలక రంగాలను పర్యవేక్షించడానికి రాజ్యాంగం ఉద్దేశపూర్వకంగానే ప్రత్యేక సంస్థలను సృష్టించిందని జస్టిస్ నాగరత్న అన్నారు. అటువంటి సంస్థలు రాజకీయ ప్రక్రియల ప్రభావానికి లోను కాకుండా స్వతంత్రంగా పనిచేయడం అత్యంత ముఖ్యమని ఆమె నొక్కి చెప్పారు. రాజ్యాంగంలోని 324 అధికరణ కింద కేంద్ర ఎన్నికల సంఘం రాజ్యాంగ ప్రాముఖ్యతను ఆమె ప్రముఖంగా ప్రస్తావిస్తూ ఎన్నికలు కేవలం కాలానుగుణ సంఘటనలు మాత్రమే కాదని. అవి రాజకీయ అధికారాన్ని ఏర్పాటు చేసే అసలైన యంత్రాంగమని ఆమె తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై నియంత్రణే ప్రజాస్వామ్యంలో రాజకీయ పోటీ పరిస్థితులను సమర్థవంతంగా నిర్ధారిస్తుందని అన్నారు. టీఎన్ శేషన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ ఎన్నికల సమగ్రతను నిర్ధారించే బాధ్యత అప్పగించబడిన అత్యంత ప్రాముఖ్యత కలిగిన రాజ్యాంగ అధికార సంస్థగా ఎన్నికల సంఘాన్ని కోర్టు గుర్తించిందని ఆమె పేర్కొన్నారు. సకాలంలో ఎన్నికలు జరగడం వల్ల ప్రభుత్వాల్లో సులభమైన మార్పులు జరుగుతాయని మన రాజ్యాంగ ప్రజాస్వామ్యం సమర్థవంతంగా నిరూపించిందన్నారు. ఆ ప్రక్రియపై నియంత్రణ అంటే వాస్తవానికి రాజకీయ పోటీ పరిస్థితులపైనే నియంత్రణ కలిగి ఉండటమని జస్టిస్ నాగరత్న తెలిపారు.

**స్వతంత్ర ఆడిట్ అవసరం**

ఆర్టికల్ 148 ప్రకారం కాగ్ రాజ్యాంగపరమైన పాత్ర గురించి కూడా జస్టిస్ నాగరత్న మాట్లాడుతూ ప్రజా వ్యయం అనేది కేవలం ఒక పరిపాలనా విధి మాత్రమే కాదని, అది వనరులను కేటాయించడానికి, ప్రభుత్వ ప్రాధాన్యతలను అమలు చేయడానికి ఉపయోగపడే ఒక యంత్రాంగమని పేర్కొన్నారు. స్వతంత్ర పర్యవేక్షణ లేకపోతే ఆర్థిక నిర్ణయాలు పరిశీలన, జవాబుదారీతనం నుండి తప్పించుకోవచ్చని ఆమె వివరించారు. కాగ్ బాహ్య ఆడిట్‌లను నిర్వహించడం ద్వారా ప్రజావ్యయాన్ని భరించే కార్యనిర్వాహక, శాసన సభలకు సంబంధం లేని ఒక స్వతంత్ర అధికార సంస్థ ద్వారా ఆ వ్యయాన్ని పరిశీలించేలా నిర్ధారిస్తుందని ఆమె చెప్పారు.

# పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదు ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు

● మహబూబ్ నగర్‌జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపిఎస్



**మిడ్జిల్, ఏప్రిల్ 04, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ తెలియజేయునది ఏమనగా, బాధితులకు సౌలభ్యం కల్పించే విధంగా తెలంగాణ పోలీస్ "ఇంటి వద్ద ఎఫ్ఐఆర్ నమోదు" విధానాన్ని అమలు చేస్తున్నది.ప్రత్యేకంగా మహిళలు, పిల్లలు మరియు బలహీన పరిస్థితుల్లో ఉన్న బాధితులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.లైంగిక నేరాలు, హత్యాయత్నం, గాయపరిచే ఘటనలు, దొంగతనం, దోపిడీ, చోరీ వంటి ఆస్తి సంబంధిత, పోక్సో, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ, బాల్య వివాహ నిరోధక చట్టాల వంటి సంభందహిత నరాలలో బాదితులు పోలీసు స్టేషన్ కు రాలేని పరిస్థితులలో ఫోన్ ద్వారా సమాచారం అందించిన యెడల వెంటనే, పోలీసు వారు వారి నివాసం లేదా తమకు అనుకూలమైన ప్రదేశమునకు వెళ్ళి ఫిర్యాదు స్వీకరిస్తారు, ఫిర్యాదుదారు ఫిర్యాదు రాయలేని పరిస్థితులలో పోలీసు వారే బాధితుని వాంగ్మూలం వారి భాషలోనే నమోదు చేసి చదివి వినిపించి వారి సంతకం తీసుకొని అక్కడినుండే ఎఫ్ఐఆర్ (FIR) నమోదు చేసి, అక్కడే ఫిర్యాదుదారునికి ఎఫ్ఐఆర్ (ఫీ×=) ప్రతిని అందజేయబడుతుంది.ప్రత్యేకంగా మహిళలు, పిల్లల కేసుల్లో మహిళా పోలీసు అధికారిని తప్పనిసరిగ వెళతారు. అవసరమైతే ఇంటర్‌ప్రెటర్ లేదా ప్రత్యేక ఉపాధ్యాయుల సమక్షంలో వాంగ్మూలం తీసుకుంటారు. పోలీసులు సంఘటన స్థలాన్ని రక్షించి, సాక్ష్యాలను సేకరించే చర్యలు వెంటనే చేపడతారు. ఈ విధానం వల్ల ఫిర్యాదు నమోదు ఆలస్యం తగ్గుతుంది. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లే భారం తగ్గుతుంది. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకొని నేరాలను నిర్భయంగా ఫిర్యాదు చేయాలని కోరడమైనది. మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రజల భద్రతకు కట్టుబడి పనిచేస్తున్నది.

## వరంగల్ నగరంలో శ్రీ గోవిందరాజ స్వామి రథోత్సవం



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 3 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలోని శ్రీ గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం రథోత్సవం కన్నుల పండుగగా సాగింది. భక్తులు గోవింద నామస్మరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కొబ్బరికాయలు కొట్టి, హారతులు సమర్పించారు. అర్చకులు భక్తులకు ఆశీర్వచనాలు అందించి ప్రసాద వితరణ చేశారు. నగరంలోని ఎల్లం బజారు ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది.

## మన ఫ్రెష్ మిల్క్ డెయిరీ ఔట్‌లెట్‌ను ప్రారంభించిన వరంగల్ ఎంపీ, ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 3 (నేటి దర్శిని బ్యూరో):** ప్రజలకు శుద్ధమైన నాణ్యమైన పాలు పాల పదార్థాలు అందించడం డైరీ పాత్ర కీలకమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన "మన ఫ్రెష్ మిల్క్"డెయిరీ ఔట్‌లెట్‌ను స్థానిక శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ స్థానికంగా నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులు అందుబాటులోకి రావడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఇలాంటి చిన్న వ్యాపారాలు గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుస్తాయని పేర్కొన్నారు.ప్రజలకు శుద్ధమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందించడంలో ఇలాంటి డెయిరీ ఔట్‌లెట్ల పాత్ర కీలకమని, వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. స్థానిక యువత వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి స్వయం ఉపాధి సాధించేందుకు ఇలాంటి ప్రయత్నాలు ప్రోత్సాహకరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కాలనీ వాసులు, వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రిజర్వాయర్ల పనులు పూర్తి చేయాలి

- సిపిఎం నేత నాగార్జున డిమాండ్




● శివన్నగూడెం-లక్ష్మణపురం రిజర్వాయర్ల ఆలస్యం రైతులకు అన్యాయం
● కాలువల నిర్మాణం లేక నీటి సరఫరా దెబ్బతింది: సిపిఎం విమర్శ

**మునుగోడు, ఏప్రిల్04 (నేటి దర్శిని):** శ్రీశైలం ఎడమ గట్టు కాలువ ద్వారా డిండి ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు, తాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న శివన్నగూడెం, లక్ష్మణపురం రిజర్వాయర్ల పనులు నత్తనడకన సాగుతున్నాయని, వెంటనే పూర్తి చేసి కాలువల ద్వారా రైతాంగానికి నీరు అందించాలంటూ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. శనివారం మర్రిగూడ మండల కమిటీ సమావేశం నీలకంఠం రాములు అధ్యక్షతన నిర్వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన నాగార్జున మాట్లాడుతూ--- గత ప్రభుత్వాలు రిజర్వాయర్లు నిర్మించినప్పటికీ, వాటికి అనుసంధాన కాలువలు, నీటి కేటాయింపులు, డీపీఆర్ ఆమోదంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. మునుగోడు ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్య తీవ్రంగా ఉండి, అనేక మంది అనారోగ్యానికి గురవడం, వికలాంగులుగా మారడం, ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలు ఉన్నప్పటికీ ప్రభుత్వం సమస్య పరిష్కారంలో విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలులో కూడా విఫలమైందని, వాటిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.
రైతుల సమస్యలపై మాట్లాడుతూ--- ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేసి ప్రతి గింజను కొనుగోలు చేయాలని, హామీ ఇచ్చిన బోనస్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. ఉపాధి హామీ పనుల్లో కనీస వేతనాలు అమలు కావడం లేదని, మండుతున్న ఎండల్లో కూలీలకు సరైన గిట్టుబాటు లభించడం లేదని తెలిపారు. వేసవికాలంలో అదనపు బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏప్రిల్, మే నెలల్లో గ్రామ గ్రామాన ప్రజా సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో పర్యటనలు నిర్వహిస్తామని, రోడ్లు మరియు ఇతర మౌలిక సదుపాయాల కోసం నిరంతర ఉద్యమాలు చేపడతామని పేర్కొన్నారు. మునుగోడు ఎమ్మెల్యే ఎన్నికల హామీలకే పరిమితమై, వాటి అమలులో విఫలమయ్యారని విమర్శిస్తూ, ప్రజలతో కలిసి ప్రభుత్వంపై పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మర్రిగూడ మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, జిల్లా కమిటీ సభ్యులు నాంపల్లి చంద్రమౌళి, మండల నాయకులు నీలకంఠం రాములు, దామెర లక్ష్మి, పగిళ్ల రామచంద్రం, గడగోటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా ప్రతి సమస్యను పరిష్కరిస్తా.....

● 10వ వార్డ్ కౌన్సిలర్ కోగూరి అనితా శ్రీనివాస్ రెడ్డి.....



**ఆమనగల్లు,ఏప్రిల్04(నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు పెంటతండాలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్నారని ఆ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించిన 10వ వార్డు కౌన్సిలర్ కోగోరి అనిత శ్రీనివాస్ రెడ్డి తండాప్రజలతో కలిసి కొబ్బరికాయలు కొట్టి శనివారం పనులను ప్రారంభించారు. కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి గారి ప్రత్యేక చొరవతో ఈ పనులను ప్రారంభించడం తో ప్రజలు వారికి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీధర్ నాయక్,ఎస్ రవి,గన్సియా,తిరు మల్లేష్, వెంకటేశ్వర్ రెడ్డి,శంకర్, భీమా,చంద్రు, శంకర్ , భాస్కర్, రాజు, నరేందర్, శ్రీను, కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో జాప్యం.. రైతులతో గేమ్స్ ఆడితే భారీ ఆందోళనలు!

● ఐకెపి కేంద్రాల ప్రారంభంలో ఆలస్యం -- ప్రభుత్వ నిర్లక్ష్యంపై విమర్శలు
● కొండ రాశులుగా పేరుకుపోయిన ధాన్యం -- వర్షాల బెడదతో రైతుల ఆందోళన
● చార మొగ్గ పేరిట కోతలు -- మిల్లర్లతో కుమ్మక్కై మోసాల ఆరోపణలు
● పిఎసిఎస్--మహిళా సంఘాల మధ్య వివాదాలతో కొనుగోలు ప్రక్రియ నిలిచిపోవడం
● వెంటనే కొనుగోలు ప్రారంభించకపోతే రైతులతో కలిసి ఉద్యమానికి హెచ్చరిక



**తిప్పర్తి, ఏప్రిల్04 (నేటి దర్శిని):** యాసంగి వరి కోతలు మార్చి మూడవ వారం నుంచి వేగంగా కొనసాగుతున్నప్పటికీ, ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ జాప్యం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. తిప్పర్తి మండలంలో ఐకెపి కేంద్రాలు ఇంకా ప్రారంభం కాకపోవడంపై బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. శనివారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన పార్టీ నాయకులు, అక్కడ కొండ రాశులుగా పేరుకుపోయిన ధాన్యం పరిస్థితిని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పొలాల నుంచి వరిని నూర్పిడి చేసి ఐకెపి కేంద్రాలకు తరలించి, తేమ శాతం తగ్గేవరకు రోజులు గడుపుతున్నా ఇప్పటివరకు ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయలేదని ఆరోపించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి తండు సైదులు గౌడ్, మాజీ మండలాధ్యక్షులు కందుల అంజయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం కావాలనే పిఎసిఎస్ మరియు మహిళా సంఘాల మధ్య వివాదాలు సృష్టించి కొనుగోలు ప్రక్రియను ఆలస్యం చేస్తోందని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో సేకరణ చేపట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం రైతులను నిరాశపరుస్తోందని అన్నారు.మరోవైపు, ఐకెపి కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు మిల్లర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అక్కడ తూపాలలో మోసాలు జరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చార మొగ్గ పేరుతో కేజీల కొద్దీ కోతలు విధిస్తే బీఆర్ఎస్ సహించదని నాయకులు హెచ్చరించారు. ఇక అకాల వర్షాలు కురిస్తే కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిసి ముద్దయ్యే ప్రమాదం ఉందని, దానికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు ఇప్పటివరకు మిల్లర్లకు ట్యాగింగ్ చేయకపోవడం, రవాణా ఏర్పాట్లు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, లేకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.'

## బెస్ట్ న్యూస్ పిక్చర్ అవార్డు గ్రహీత ముచ్చర్ల శ్రీనివాస్ గౌడ్

● కెమెరా కంటికి చిక్కితే అవార్డు





**నల్గొండ,ఏప్రిల్04(నేటి దర్శిని):** తెలంగాణ స్టేట్ ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ 2025 ఉత్తమ ఫోటో జర్నలిస్టుల అవార్డు ప్రధాన కార్యక్రమం ఆదివారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయంలో జరగనుంది. భారత మాజీ ఉప రాష్ట్రపతి ఏం. వెంకయ్య నాయుడు ముఖ్యఅతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ కె. శ్రీనివాస్ రెడ్డి ఆత్మీయ అతిథిగా మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ ప్రియాంక అతిథుల చేతుల మీదుగా నల్గొండ ది హాన్స్ ఇండియా ఫోటో జర్నలిస్ట్ ముచ్చర్ల శ్రీనివాస్ గౌడ్, బెస్ట్ న్యూస్ పిక్చర్ అవార్డు అందుకోనున్నారు.

# తంగేలపల్లిలో శ్రీ నంధీశ్వర ధ్వజస్తంభ ప్రతిస్ఠాపన మహోత్సవాలు





● ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**షాద్ నగర్, ఏప్రిల్04 (నేటి దర్శిని ప్రతినిధి):** షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలంలోని తంగెలపల్లి గ్రామంలో శివాలయంలో శ్రీ నందీశ్వర ధ్వజస్తంభం ప్రతిష్టాపన మహోత్సవాల్లో భాగంగా జరుగుతున్న పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ హిందూ దేవాలయాలలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన అత్యంత పవిత్రమైనదని,ఇది ఆలయ నిర్మాణంలో వెన్నెముక వంటిదని దైవశక్తిని ఆలయంలోకి ఆకర్షించి, భక్తులకు దైవదర్శనం ముందు సూచనగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కొందుర్గు మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్,మాజీ జెడ్పిటిసి తనయుడు రామకృష్ణ మహాదేవపూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి,ఉమెంతాల సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్ రెడ్డి,విశ్వనాధ్ పూర్ సర్పంచ్ శ్రీలత రాములు,ఉత్తరాస్ పల్లి సర్పంచ్ నందు,ఉపసర్పంచ్ హాలీం బాయ్,మాజీ సర్పంచులు బాల్ రాజ్,గోపాల్ నాయక్,వెంకటేష్,జనార్దన్ గౌడ్, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ నాయకులు జగదీష్ శ్రీశైలంగౌడ్,రవీందర్ గౌడ్,నర్సిములు,పెర్మల్ రెడ్డి, పులిందర్ రెడ్డి,నగేష్ ప్రవీణ్,హన్మంత్,యాదయ్య, వెంకటేష్,క్రిష్ణ బండి శేఖర్,కొత్త బాల్ రాజ్, చెంద్రయ్య, శ్రీను,శ్రీకాంత్ గౌడ్, యాదగిరి,సిహెచ్ రాము, బాగల్ల రాములు, కబీర్ దాస్,గణేష్ నగేష్,క్రిష్ణ,ప్రశాంత్, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలి స్పోర్ట్స్ హాకథాన్‌లో మ్యాచ్ పాయింట్ అకాడమీకి మెడల్ వర్షం




**గచ్చిబౌలి, ఏప్రిల్04 (నేటి దర్శిని):** గచ్చిబౌలి స్టేడియంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'స్పోర్ట్స్ హాకథాన్'లో మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు అద్భుత ప్రతిభతో మెడల్ వర్షం కురిపించారు. సుమారు 20కి పైగా క్రీడా విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో అకాడమీకి చెందిన యువ షట్లర్లు తమ ప్రతిభను చాటుతూ పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు.అండర్-9 విభాగంలో సాన్వి చేలూరి అసాధారణ ప్రతిభ కనబరిచి సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో టైటిళ్లు సాధించి క్లీన్ స్వీప్ చేసింది. అండర్-13 బాలుర విభాగంలో శ్రీ లిఖిత్--అద్వైత్ సంబరి జంట సమన్వయంతో అద్భుతంగా ఆడి ఫైనల్స్‌కు చేరుకుని రన్నరప్‌గా నిలిచి వెండి పతకాన్ని కైవసం చేసుకుంది.అండర్-15 బాలికల విభాగంలో సాన్వి లట్టాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సెమీఫైనల్లో ఒడిశాకు చెందిన అర్పిసా పండాపై 15-07తో విజయం సాధించిన ఆమె, ఫైనల్లో సాయి గచ్చిబౌలికి చెందిన టాప్ ర్యాంకర్ తనిష్ట శ్రీనివాస్‌పై 15-11తో గెలిచి ఛాంపియన్‌గా అవతరించింది.ఈ విజయాలపై అకాడమీ హెడ్ కోచ్, జాతీయ స్థాయి క్రీడాకారుడు వేణు ముప్పాల ఆనందం వ్యక్తం చేశారు. "మా అకాడమీ శిక్షణ నాణ్యతకు ఈ విజయాలే నిదర్శనం. యువ క్రీడాకారులను ఛాంపియన్లుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం," అని తెలిపారు.ఇదిలా ఉండగా, వేసవి సెలవులను పురస్కరించుకుని మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ ఏప్రిల్ 5 నుంచి జూన్ 5 వరకు ప్రత్యేక సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు అకాడమీ యాజమాన్యం వెల్లడించింది. ప్రొఫెషనల్ శిక్షణ పొందాలనుకునే క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

# విధి నిర్వహణతో పాటు కుటుంబానికి సమయం ప్రశాంత జీవనానికి కీలకం






● మహబూబ్ నగర్ జిల్లాఎస్పీ డి.జానకి ఐపీఎస్

**మిడ్జిల్, ఏప్రిల్ 04, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానంలో శనివారం రోజు కవాతు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ హాజరై కవాతును పరిశీలించారు.ఈ కవాతులో సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్, ట్రాఫిక్ పోలీసులు, మహిళా పోలీసులు మరియు ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా, ఉద్యమాలు, ధర్నాలు, రాస్తారోకోలు వంటి పరిస్థితులలో పోలీసులు ఎలా స్పందించాలి అనే




అంశంపై మాక్ డ్రిల్ నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలను ప్రదర్శనాత్మకంగా వివరించారు.అనంతరం జిల్లా ఎస్పీ సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను స్వయంగా విని, తగిన సూచనలు అందించారు.విధుల కారణంగా ఒత్తిడికి గురవుతారని పేర్కొన్నారు. కాబట్టి ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కుటుంబ సభ్యులతో సమయం గడపడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని, అది జీవితాన్ని మరింత ఆనందకరంగా, ప్రశాంతంగా, అందంగా మార్చుతుందని తెలిపారు. అలాగే ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతిరోజూ వ్యాయామం, నడక, యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటి కార్యక్రమాలు అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ విధంగా ఉద్యోగం, కుటుంబం, ఆరోగ్యాన్ని సమతుల్యంగా నిర్వహించుకుంటే సంతోషకరమైన జీవితం గడపవచ్చని తెలిపారు.

# ఆమనగల్లుకు పూర్వవైభవం తెస్తాం...

● నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి.



**ఆమనగల్లు, ఏప్రిల్04(నేటి దర్శిని ప్రతినిధి):** గత పది ఏళ్ల బిఆర్ఎస్ కాలంలో ఆమనగల్లు చిన్నాభిన్నం చేశారని, అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఆమనగల్లుకు పూర్వవైభవం తెస్తామని నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి తెలిపారు.ఆమనగల్లు పట్టణంలో నాలుగు కోట్ల రూపాయలతో చేపట్టిన బీసీ హాస్టల్ భవన నిర్మాణం పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ నేనావత్ పత్యానాయక్,మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, ఆమనగల్ మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు తో కలిసి పార్లమెంట్ సభ్యులు మల్లురవి పరిశీలించారు. పనులను నాణ్యతగా, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్కు సూచించారు. విద్యారంగంలో ఆమనగల్లును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి విద్య హబ్ గా మారుస్తామని తెలిపారు.అందులో భాగంగానే తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామం వద్ద 25 ఎకరాలలో ప్రభుత్వం 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మిస్తుందని తెలిపారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల భూ వివాద సమస్య త్వరలో పరిష్కారం అవుతుందని, భవనం పనులను పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీతో ఆమనగల్లు పూర్వపు సమితికి వరంలా మారుతుందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగంగా ఆమనగల్లుకు ఏసీబీ కార్యాలయం తీసుకురావడం జరిగిందని, అతి త్వరలో అన్ని డివిజనల్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని మల్లురవి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో కలిసి ఆమనగల్లుకు పూర్వ వైభవం కి ఇస్తామని ఎంపీ మల్లు రవి ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రశీదు లేకుండా గ్యాస్ డబ్బులు ఇవ్వొద్దు


● వినియోగదారులకు హెచ్చరిక




**నల్గొండ, ఏప్రిల్04 (నేటి దర్శిని బ్యూరో):** పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటీ మాచన రఘునందన్ గ్యాస్ సిలిండర్ సరఫరాలో జరుగుతున్న అక్రమాలపై వినియోగదారులను అప్రమత్తం చేశారు. "గ్యాస్‌కు ఎంత ఇయ్యాలే తమ్మీ" అని అడగడం మానేసి, తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. మారుమూల గ్రామంలో గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేసిన ఆయన, అక్కడ గ్యాస్ కోసం వేచి ఉన్న ప్రజలతో మాట్లాడారు. వినియోగదారులు సిలిండర్‌కు 1030 చెల్లిస్తున్నామని, రశీదు ఇవ్వడం లేదని తెలిపారు.దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రఘునందన్, గ్యాస్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వహణ వ్యాపారం కాదని, సేవా భావంతో నడపాల్సినదని స్పష్టం చేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడే డెలివరీ సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం తప్పదని తెలిపారు.


# బిఆర్ఎస్ నాయకుల ఆశీస్సులు

● తీదేడు గ్రామంలో ఘనంగా వివాహ వేడుక



**చింతపల్లి, ఏప్రిల్ 4 (నేటి దర్శిని ప్రతినిధి):** చింతపల్లి మండలం తీదేడు గ్రామానికి చెందిన శివర్ల నర్సింహా--పద్మ దంపతుల కుమారుడు శివ శిరీష వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకకు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, కేతావత్ బిల్య నాయక్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులు, సుఖసంతోషాలతో దాంపత్య జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి, మర్రు రామారావు, ఉలుపాల పురుషోత్తం రెడ్డి, సిమర్ల శ్రీను యాదవ్, తిరుమణి పాపయ్య, దాసరి తిరుపతయ్య, కాయితి బచ్చిరెడ్డి, మర్రు శ్రీనివాసరావు, మర్రు జనార్ధన్ రావు, మర్రు రంగారావు, రెడ్డి పరమేష్, బొడ్డు యాదగిరి, మొరుపోజు రాజు, దాసరి వెంకటయ్య, దాసరి ముత్తయ్య, రెడ్డి గాలయ్య, బోడ్డు సంతోష్, మునగాల అశోక్, సందె దేవయ్య, సందె శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు

# శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**చంపాపేట, ఏప్రిల్04 (నేటి దర్శిని):** చంపాపేట డివిజన్ పరిధిలోని దుర్గనగర్ కాలనీ నందు ఉన్న శ్రీశ్రీశ్రీ పోచమ్మతల్లి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా చంపాపేట డివిజన్ సీనియర్ భారస నాయకులు చీర శ్రీనివాస్ గారి ఆహ్వానం మేరకు ఈ రోజు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీదేవిరెడ్డి సుధీర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో పలువురు నాయకులు, దేవాలయం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ లో సంగెం ఇబ్రాహీం పుట్టినరోజు వేడుకలు



**షాద్ నగర్ 4 ఏప్రిల్ నేటి దర్శిని ప్రతినిధి**

షాద్ నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ 15వ వార్డు కౌన్సిలర్ మరియబేగం భర్త సాదిక్, బీసీ జనసేన అధికార ప్రతినిధి స్రవంతి రాజ్ ఆధ్వర్యంలో సంగెం గ్రామ కాంగ్రెస్ నాయకుడు ఇబ్రహీం పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగింది. ఇటీవల మున్సిపాలిటీ ఎన్నికల్లో వార్డు ఇన్చార్జిగా పనిచేసే కాంగ్రెస్ పార్టీకి గెలుపును అందించిన నేపథ్యంలో ఇబ్రహీం పుట్టినరోజు వేడుకలు స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు బీసీ జనసేన నాయకురాలు తదితరులు కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి తినిపించారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని బీసీ జనసేన నాయకురాలు స్రవంతి రాజ్, కాంగ్రెస్ నాయకులు సాదిక్ తదితరులు ఆశించారు..

# డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి



**(నేటి దర్శిని):, జైపూర్, ఏప్రిల్ 04**

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ లోని ప్రాణహిత గెస్ట్ హౌస్ కాన్ఫరెన్స్ హాల్ యందు 14.04.2026 నాడు జరగబోయే డా.. బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతి ఏర్పాట్లకు సంబంధించిన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈడి ఎస్టిపిపి సిహెచ్. చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈడి సిహెచ్. చిరంజీవి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సారి కూడా డా.. బి.ఆర్.అంబేద్కర్ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్వాహక సభ్యులను కోరారు. అనంతరం ఏర్పాట్లకు సంబంధించి విధి విధానాలను రూపొందించారు. దీనికి ఎస్సి, ఎస్టి, బీసి ఉద్యోగ సంఘాల నాయకులు, సభ్యులు సామూహికంగా మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్టిపిపీ జిఎం ఎం. నరసింహ రావు, జిఎం (పిసిఎస్) అండ్ (ఓ అండ్ ఎం) ఎం. మదన్ మోహన్, ఎస్సి, ఎస్టి, బీసి ఉద్యోగ సంఘాల?? లైజన్ ఆఫీసర్లు, ప్రెసిడెంట్లు, సభ్యులు, అన్ని విభాగాల విభాగాధిపతులు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొనడం జరిగింది.

# నేడు ఖనిలో సంఘం శరణం గచ్ఛామి...

*– అంబేద్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన..*



**(నేటి దర్శిని):/గోదావరిఖని: ఏప్రిల్ 04**

సామాజిక వేదిక ఆధ్వర్యంలో శనివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు గుమ్మడి కుమారస్వామి, కవ్వంపల్లి స్వామి మాట్లాడుతూ.. ఏప్రిల్ ఒకటి నుండి 15 వరకు సామాజిక సమతా వేదిక ఆధ్వర్యంలో దళిత, బహుజనలు, మైనారిటీల ఐక్యతను వివరిస్తూ మహానీయుల జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఈ వేదిక ఏర్పాటు చేశామని అన్నారు. ఇందులో భాగంగా అంబేద్కర్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ నిర్వహిస్తున్నామని 5న జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలతో పాటు సాయంత్రం అంబేద్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన స్వర్గీయ గడ్డం వెంకటస్వామి స్మారకార్థం సంఘం శరణం గచ్ఛామి కార్యక్రమం ద్వారా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ప్రస్తుత యువకులకు అంబేద్కర్ జీవిత చరిత్రను నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలోని ప్రజలు యువత ఈ ప్రదర్శనను తిలకించాలని కోరారు. అలాగే పూలే అంబేద్కర్ జయంతి వేడుకలతో పాటు 13న భారీ సామాజిక సమత ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. 14న గోదావరిఖనిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదాసు రామ్మూర్తి, పులి మోహన్, పెంట రాజేష్, జెవి రాజు, పర్లపల్లి రవి, రాసపల్లి రవికుమార్, చింటూ, కాశిపేట శివాజీ, కోటగిరి పాపయ్య, కల్వల సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 9 నుంచి 24 వరకు ‘ప్రధాన్ మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్’



మాట్లాడుతున్న
ఎంపీ .డీకే అరుణ



మాట్లాడుతున్న Pmskm
పార్లమెంట్ ఇంచార్జ్జి ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

**● గ్రామీణ యువతలో క్రీడా ప్రతిభను వెలికి తీయడమే ప్రధాన లక్ష్యం ఎంపీ. డి.కె అరుణ**




**మహబూబ్ నగర్,ఏప్రిల్04 ( నేటి దర్శని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**

మహబూబ్‌నగర్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో ఏప్రిల్ 9 నుంచి 24 వరకు నిర్వహించనున్న ‘ప్రధాన్ మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్’ ద్వారా గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని ఎంపీ. డీకే అరుణ పేర్కొన్నారు.ఈ క్రీడా మహోత్సవానికి సంబంధించి శనివారం మహబూబ్‌నగర్‌లోని ఐ.డి ఓ.సి కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా ఎంపీ. డీకే అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండల, అసెంబ్లీ స్థాయి ఇన్‌చార్జులు, జిల్లా విద్యా శాఖ అధికారులు, యువజన క్రీడాశాఖ అధికారులు, పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు తదితరులు సమన్వయంతో పని చేసి ఈ క్రీడ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రారంభోత్సవం ఏప్రిల్ 9న నారాయణపేటలో నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి జట్లు ఏప్రిల్ 6లోపు ఆఫ్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 9 నుంచి 15 వరకు మండల స్థాయి పోటీలు, ఏప్రిల్ 15 నుంచి 20 వరకు అసెంబ్లీ స్థాయి పోటీలు, ఏప్రిల్ 21 మరియు 22 తేదీల్లో పార్లమెంటరీ స్థాయి పోటీలు నిర్వహించబడతాయని చెప్పారు.ఏప్రిల్ 23న పరుగు పందాలు నిర్వహించబడతాయని, ఏప్రిల్ 24న బహుమతుల ప్రదానోత్సవం మరియు ముగింపు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఆ రోజున తెలంగాణ గవర్నర్ ముఖ్య అతిథిగా



పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ క్రీడా మహోత్సవంలో కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, క్రికెట్ అనే నాలుగు ప్రధాన క్రీడలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతి మండలంలో ప్రతి క్రీడకు ఒక కోఆర్డినేటర్ చొప్పున నలుగురిని నియమించి పోటీల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. క్రీడా వేదికల వద్ద సరైన మైదానాలు, గ్రౌండ్ మార్కింగ్, నీడ కోసం టెంట్లు, తాగునీటి సదుపాయం, అలాగే గాయాల నివారణకు తగిన వైద్య సదుపాయాలు మరియు ఫస్ట్ ఎయిడ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పోటీలు సజావుగా సాగేందుకు పోలీసు భద్రతను కూడా కల్పించాలని సూచించారు. యువత శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని, డ్రగ్స్ వంటి చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంచడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్‌లకు అలవాటు పడిన పిల్లలకు కూడా ఇది మంచి అవకాశమని, తమ ప్రతిభను చాటుకునే వేదికగా ఉపయోగించుకోవాలని యువతను పిలుపునిచ్చారు.

మండల ఇన్‌చార్జులు నమోదు చేసుకున్న జట్లకు క్రీడా కిట్లు పంపిణీ చేసి, పీఈటీలతో సమన్వయం చేసుకుని పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ క్రీడలలో పురుషులతో పాటు స్త్రీలు, బాలికలకు కూడా ప్రాముఖ్యత ఇచ్చి వారిని క్రీడలలో పాల్గొనేవిధంగా ప్రోత్సహించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి ప్రవీణ్ కుమార్, మహబూబ్‌నగర్ జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, నారాయణపేట జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్, జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి రెడ్డి, వనపర్తి జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, డిప్యూటీ సీఈఓ మల్లికార్జున్, పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు, మండల స్థాయి ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పట్ల పాలకుల వివక్ష

**● పోరాటం లేనిదే సమస్యలు పరిష్కారం కావు**

**● టీడబ్ల్యూజేఎఫ్ ( హెచ్-2843) వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య**



**ఖమ్మం, ఏప్రిల్ 04(నేటి దర్శిని):**

జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం,పాలకులు చూపుతున్న వివక్ష,నిర్లక్ష్య వైఖరిని విడనాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టిడబ్ల్యుజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం జిల్లా కేంద్రంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి పని చేస్తున్న పాత్రికేయులు తమ సమస్యలపై రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల గడిచినా, ఇంతవరకు జర్నలిస్టులకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని, కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందని ఆయన ధ్వజమెత్తారు. అక్రెడిటేషన్ కార్డుల్లో కోత లేకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త అక్రెడిటేషన్లు ఇవ్వాలని, అదేవిధంగా ప్రభుత్వం జర్నలిస్టుల కోసం ప్రకటించిన మ్యానిఫెస్టో అంశాలను అమలు చేయాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. జర్నలిస్టుల పట్ల గతంలో ఎన్నడూ లేని వివక్ష కొనసాగుతుందని, అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను గందరగోళం చేసి జర్నలిస్టులను ఆందోళన వైపుకు నెట్టారని అన్నారు. ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల ఆందోళనను ఉధృతం




చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలో చాలా ఏళ్ళుగా పెండింగ్ లో ఉన్న ఇళ్ళస్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో టీడబ్ల్యూజేఎఫ్ ( హెచ్-2843) నాయకులు జర్నలిస్టుల సమస్యల, సంక్షేమం వైపు దృష్టి సారించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ సంఘాన్ని బలోపేతం చేయాలని ఆయన సూచించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ (హెచ్-2843)హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి నగేష్,లీగల్ అడ్వయిజర్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో ఈ రోజున కొత్త కమిటీ ఎన్నిక ఖమ్మం జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీ.డబ్ల్యు.జే.ఎఫ్) ఖమ్మం జిల్లా నూతన అధ్యక్షుడుగా నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి గా అర్వపల్లి నగేష్, కోశాధికారి గా వేములకొండ రమేష్ కుమార్ లను తో పాటు పూర్తి స్థాయి కమిటీ ఎన్నిక జరిగింది. ఈ జనరల్ బాడీ సమావేశంలో జిల్లా టి.బి.జే.ఎ అధ్యక్షుడిగా వందనపు సామ్రాట్ గుప్తా, కార్యదర్శి కాసోజు శ్రీధర్, టీబీజేఏ ఖమ్మం నగర అధ్యక్షుడు వెలుగోటి వెంకట్ కార్యదర్శి నల్ల రాకేష్ రెడ్డి, టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం నగర అధ్యక్షుడు గంటేల కుమార్, కార్యదర్శి కప్పల మధు, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఆన్తోటి శ్రీనివాస్, కార్యదర్శి మల్లెల శిల్ప ఫోటోగ్రాఫర్ అధ్యక్షుడు అమరబోయిన ఉపేందర్ కార్యదర్శి చెరుకుమల్లి సతీష్ , మరియు జిల్లా సంయుక్త కార్యదర్శి కుంభం రవికుమార్, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, నాగకృష్ణ, ఈసీ మెంబర్స్ మామిడాల వీరబాబు, మహమ్మద్ షకీల్ పాషా, లింగాల రామ్మూర్తి, ఓరుగంటి కిరణ్, ఎలిశెట్టి రామకృష్ణ బాబు, కల్లేపల్లి లింగయ్య, స్వాతి, శివ, జగదీష్ గౌరవ ప్రధాన సలహాదారుడు కొదుమూరి జగన్నాధ రావు తదితరులు పాల్గొన్నారు.




# అడివి శేష్ 'డెకాయిట్' ట్రైలర్ విడుదల

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అడివి శేష్, అందాల నటి మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన మోస్ట్ అవైటెడ్ రివెంజ్ అండ్ యాక్షన్ డ్రామా 'డెకాయిట్' (ఖుఛీశేఖ్). ఈ చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఎప్పుడూ థ్రిల్లర్ కథలతో మెప్పించే అడివి శేష్ ఈసారి పూర్తి భిన్నంగా ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. హరి (అడివి శేష్), జూలియట్ (మృణాల్ ఠాకూర్)ల మధ్య గాఢమైన ప్రేమ కథతో మొదలైన ట్రైలర్.. ఆ తర్వాత ఊహించని నమ్మకద్రోహం, జైలు జీవితం, రివెంజ్ డ్రామాగా మారి ఉత్కంఠ రేపుతోంది. ఒక సాధారణ ప్రేమికుడు పరిస్థితుల ప్రభావం వల్ల 'డెకాయిట్'గా ఎలా మారాడనేదే ఈ చిత్ర ప్రధానాంశంగా తెలుస్తోంది. ఈ చిత్రంతో షానీల్ డియో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తూ టాలీవుడ్‌లోకి అడుగు పెడుతుండగా వీరితో పాటు ప్రకాష్ రాజ్, అతుల్ కుల్కర్ణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ ఈ భారీ పాన్-ఇండియా చిత్రాన్ని నిర్మిస్తుంది. భీమ్స్ సిసిరోలియో అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచింది.



# రష్మిక ఖాతాలో మరో అరుదైన ఘనత..

పాన్ ఇండియా అగ్ర కథానాయికగా తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది రష్మిక మందన్నా. అభిమానులు ముద్దుగా నేషనల్ క్రష్ అంటూ పిలుచుకునే ఈ అమ్మడు ఇటీవలే వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది. చాలా కాలంగా విజయ్ దేవరకొండతో ప్రేమలో ఉన్న రష్మిక.. ఈ ఏడాది ఇరు కుటుంబ సమక్షంలో పెళ్లి చేసుకుంది. ఇప్పుడు రష్మిక తెలుగింటి కోడలు.మరోవైపు ఇటీవలే ఉత్తమ నటిగా గద్దర్ ఫిల్మ్ అవార్డు అందుకుంది రష్మిక. తాజాగా మరో అంతర్జాతీయ ఘనత సొంతం చేసుకున్నారు. జపాన్ వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకమైన క్రంచీరోల్ యానిమే అవార్డుల వేడుకలో వరుసగా రెండోసారి ప్రెజంటర్ గా వ్యవహరించే అరుదైన అవకాశం దక్కించుకుంది. గతంలో 2024లో ఈ వేదికపై మెరిసింది రష్మిక. ఇప్పుడు మరోసారి సందడి చేయనుంది.రెండుసార్లు ఈ గౌరవం పొందిన తొలి భారతీయ సినీ సెలబ్రెటీగా రికార్డు క్రియేట్ చేసింది రష్మిక. యానిమేటెడ్ చిత్రాలు, వెబ్ సిరీస్ లలో ప్రతిభ కనబరిచిన వారికి ఇచ్చే ఈ పురస్కారాల 10వ ఎడిషన్ వేడుక మే 23న టోక్యోలో ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా హాలీవుడ్ ప్రముఖులతో కలిసి ఆమె విజేతలకు అవార్డులను అందజేయనున్నారు.పుష్ప సినిమాలోని శ్రీవల్లి పాత్రతో రష్మికకు జపాన్ లో భారీ క్రేజ్ ఏర్పడింది. ఇంటర్నేషనల్ లెవల్లో రష్మికకు భారీగా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందన్న సంగతి తెలిసిందే. ఇటీవలే యానిమల్, పుష్ప 2, కుబేర, గర్ల్ ఫ్రెండ్, థామా వంటి చిత్రాలతో వరుస హిట్స్ అందుకున్న ఆమె.. ప్రస్తుతం మైసా, రణబాలి చిత్రాల్లో నటిస్తున్నారు.రణబాలి చిత్రంలో మరోసారి విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన గీతా గోవిందం, డియర్ కామ్రేడ్ చిత్రాలు సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి వీరిద్దరి కాంబో రిపీట్ కాబోతుండడంతో రణబాలి చిత్రంపై మరింత ఆసక్తి నెలకొంది. మైసా, రణబాలి సినిమాలు త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

# ఎల్లమ్మ కథకు దేవిశ్రీ అయితేనే సరిపోతాడు
## క్లారిటీ ఇచ్చిన దర్శకుడు బలగం వేణు




'బలగం' సినిమాతో ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్న దర్శకుడు వేణు ఎల్దండి తన తదుపరి ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'తో మరోసారి భారీ అంచనాలను సృష్టిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే ఇండస్ట్రీలో హాట్ టాపిక్ నడుస్తోంది. ఈ సినిమాలో హీరోగా నాని, నితిన్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వంటి స్టార్స్ నటిస్తారని గతంలో ప్రచారం జరిగింది. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ, దర్శకుడు వేణు ఈ పాత్ర కోసం దేవి శ్రీ ప్రసాద్‌ని ఎంపిక చేశారు. ప్రపంచవ్యాప్తంగా సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందిన దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రంతో హీరోగా కొత్త ప్రయాణం ప్రారంభించ బోతున్నారు. ఇది ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ఈ నిర్ణయంపై వస్తున్న సందేహాలకు దర్శకుడు వేణు క్లారిటీ ఇచ్చారు. సినిమాలో తీసుకునే ప్రతి నిర్ణయం కథకు అనుగుణంగానే ఉంటుంది. 'ఎల్లమ్మ' కథకు ఒక ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్ ఉన్న వ్యక్తి కావాలి. మొదట వేరే నటులను అనుకున్నా? కథ మారుతూ ఉండటంతో దేవి శ్రీ ప్రసాద్ అయితేనే సరిపోతారని భావించాం అని తెలిపారు. కథలోని సహజత్వం, భావోద్వేగాలను ప్రేక్షకులకు బలంగా చేరవేయడానికి దేవి సరైన ఎంపికగా కనిపించారని ఆయన వివరించారు. బలగంతో గ్రామీణ భావోద్వేగాలను అద్భుతంగా చూపించిన వేణు? 'ఎల్లమ్మ'లో కూడా అదే మట్టి వాసనను తెరపై ఆవిష్కరించబోతున్నారు. ఈ సినిమా కూడా ఎమోషనల్ డ్రామాగా ఉండబోతుందని సమాచారం. సంగీత దర్శకుడిగా ఎనలేని క్రేజ్ సంపాదించిన దేవి శ్రీ ప్రసాద్‌ని నటుడిగా ఎలా చూపిస్తారు? ఆయన పాత్రలో ఎంతవరకు ఒదిగిపోతారు? అన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. టాలీవుడ్‌లో కొత్త ప్రయోగాలు ఎప్పుడు అందరిలో ఆసక్తిని కలిగిస్తుంటాయనే విషయం మనకు తెలిసిందే. ఈ క్రమంలో వేణు దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్ ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది.



# కియారా లుక్‌కి ఫిదా అవుతున్న ఫ్యాన్స్

కెరీర్ పీక్స్ మీదున్నప్పుడు పెళ్లి చేసుకోవడం, వెంటనే గర్భం దాల్చడం, కొన్నాళ్లకు మళ్లీ సెట్స్ మీదకు వచ్చేయడం.. మరి ఈ ప్రాసెస్ వాళ్ల ఫిజిక్‌ని ఎఫెక్ట్ చేస్తుందా? గతంలో ఉన్నంత ఫిట్‌గా కనిపిస్తున్నారా? నై నాట్ అంటున్నారు మన నాయికలు. హాయిగా తమ పని తాము చేసుకుపోవడానికి రెడీ అవుతున్నారు. పోస్ట్ ప్రెగ్నెన్సీ రీసెంట్‌గా ఓ అవార్డుల వేడుకకు హాజరయ్యారు కియారా అద్వానీ. మునుపున్నంత ఫిట్‌గా ఉన్న ఆమెని చూసి వావ్ అనకుండా ఉండలేకపోయారు జనాలు. అలా ఎలా సాధ్యం అంటూ ఆరా తీసే వాళ్ల సంఖ్య కూడా చాలానే ఉంది. పాప పుట్టాక ఆడపులిలా మారానంటున్నారు కియారా. కెరీర్ పరంగా తానెప్పుడూ ప్రొఫెషనల్‌గానే ఉంటానని, ఆ ప్లానింగ్ ఇప్పుడు చాలా ఉపయోగపడుతోందన్నారు. సినిమాలు చూడటం, సినిమాల గురించి మాట్లాడటం, షికార్లకెళ్లడం.. ఎందులోనూ మార్పు రాలేదన్నారు. మరింత ఫిట్‌గా ఉండాలన్న ఉత్సాహం వస్తోందన్నారు మిసెస్ మల్హోత్రా. పాప పుట్టాక ఆలియా కూడా మునుపటిలాగా మారారు. స్క్రీన్ మీద ఏమాత్రం మార్పు లేకుండా మెప్పించారు ఆలియా. అందుకు ఫిట్‌నెస్ ట్రైనింగ్ చాలా ఉపయోగపడిందని, ఫ్యామిలీ సపోర్ట్ మర్చిపోలేనని చెప్పారు ఆలియా. పాప పుట్టాక ఇంట్లో కాసింత ఎక్కువ సమయాన్ని గడిపిన లేడీ దీపిక పదుకోన్. జీవితం మునుపటిలా లేదన్నారు దీపిక. ప్రపంచం అంతా పాప చుట్టూనే ఉన్నట్టుందని చాలా సార్లు షేర్ చేసుకున్నారు. ప్రస్తుతం దీపికకు మల్టిపుల్ ప్రాజెక్టులు సెట్స్ మీదున్నాయి. మరి వీటితో ఈ బ్యూటీ ఎలా అలరించడానికి సిద్ధమవుతున్నారో లెట్స్ వెయిట్ అండ్ సీ...

# వీరభద్రుడి విశ్వరూపం



తమిళ అగ్ర హీరో సూర్య తాజా తమిళ చిత్రం 'కరుప్పు' తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదల కానుంది. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు నిర్మిస్తున్నారు. మే 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం తెలుగు టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో సూర్య భారీ ఖడ్గాన్ని చేతపట్టుకొని పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు.పేదల పక్షాన పోరాడి వారికి అండగా నిలబడే న్యాయవాదిగా ఈ సినిమాలో సూర్య కనిపించనున్నారు. సామాజిక, ఆధ్యాత్మిక అంశాల కలబోతగా యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. వీరభద్రుడిగా సూర్య విశ్వరూపం ప్రేక్షకులకు గూజ్‌బంప్స్ తెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సాయిఅభ్యంకర్, రచన-దర్శకత్వం: ఆర్జే బాలాజీ.


Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365